

విజనరీ సీఎం చంద్రబాబు నాయకత్వం, మంత్రి లోకేష్ కార్యాచరణతో 24 నెలల్లోనే నూతన పెట్టుబడుల్లో ఏపీ 9వ స్థానం నుంచి 2వ స్థానానికి చేరింది. స్పష్టమైన విజన్, పారదర్శక పాలన, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ప్రపంచం ఏపీ వైపు చూస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 19.08.2026

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 119 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# బీసీలకు రాజ్యాధికార బాట!

## స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు కూటమి సర్కారు గ్రీన్‌సిగ్నల్







**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : జయహో బీసీ... అంటూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ దద్దరిల్లింది. సభ్యుల హర్షాతిరేకాల మధ్య స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్ నిర్ణయాన్ని మంగళవారం జరిగిన రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి...బీసీ సాధికారతకు కట్టుబడి ఉందని అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా సామాజిక న్యాయమే అజెండా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తొలిసారిగా రిజర్వేషన్‌లను వర్తింప చేస్తూ ఎన్టీఆర్ నాడు తీసుకున్న నిర్ణయం మొదలుకుని ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను సీఎం చంద్రబాబు సభలో వివరించారు. నిబంధనలకు అనుగుణంగా.. అన్ని పరిమితులకు లోబడి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంత స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక ప్రాంత సంస్థల్లో 33.33 శాతం మేర రిజర్వేషన్‌లను బీసీ వర్గాలకు వర్తింప చేయనున్నట్టు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రానికి తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పంచాయతీరాజ్ చట్ట ప్రకారం రిజర్వేషన్ల పెంపును అమలు చేస్తున్నట్టు తెలిపారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో 34 శాతం రిజర్వేషన్‌లతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించినట్టు ముఖ్యమంత్రి సభకు గుర్తు చేశారు. సామాజిక న్యాయం అజెండాతో పని చేయడం వల్లే ఎర్రన్నాయుడు, కేఈ కృష్ణమూర్తి, యనమల, దేవేందర్ గౌడ్, అయ్యన్న పాత్రుడు వంటి లెజండరీ నాయకత్వం బీసీ వర్గాల నుంచి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌లను 24 శాతానికి కుదించడం ద్వారా 16800 మంది స్థానిక బీసీ నేతలకు రాజకీయాల్లో అవకాశాలు దక్కలేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌లను వర్తింప చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈ 34 శాతం రిజర్వేషన్ ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ముఖ్యమంత్రి కోరారు.

**స్థిరమైన పాలన కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలు..** : ఆయారాం.. గయారాం అనే విధానం కాకుండా సుస్థిరమైన పాలన అందించడం కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చేపడతామని సీఎం వెల్లడించారు. ఈ మేరకు కెబినెట్లో నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. దీంతో పాటు జిల్లాల విభజన జరిగినా ప్రస్తుతం 13 జిల్లా ప్రజా పరిషత్‌లే ఉండటంతో, పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్ లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ. 2,300 కోట్ల గ్రామీణ గ్రాంట్లు, రూ. 1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు రావాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని, సరైన అభ్యర్థుల ఎంపిక ద్వారా భావి నాయకత్వాన్ని అందించాలని కూటమి నేతలను కోరారు.

మిగతా 2లో...

# బోగస్ జీఎస్టీ ఇన్‌వాయిస్‌లపై కఠిన చర్యలు





- ప్రభుత్వ ఖజానాకు గండికొట్టే చర్యలను సహించం
- శాసనమండలిలో ఆలపాటి ప్రశ్నకు మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : బోగస్ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు, నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా పన్నుల ఎగవేతకు పాల్పడుతున్న వారిపై సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.

మంగళవారం శాసనమండలిలో సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. బోగస్ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా పన్నుల ఎగవేతకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. నకిలీ జీఎస్టీ ఇన్‌వాయిస్‌లు జారీ చేయడం, వ్యాపార లావాదేవీలను ప్రభుత్వానికి తెలియకుండా చేయడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు మిగతా 2లో...

# మెగా డీఎస్సీ... భేష్




## 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పారదర్శకంగా

### వివాదాలకు తావులేకుండా నియామకాలు..

### లోకేష్‌కు ఢిల్లీ మంత్రి అభినందనలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 16వేల మంది ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిన తీరుపై ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌పై ప్రశంసలు కురిపించారు. మంగళవారం ఆయన ఆర్టీజీఎస్‌లో విద్యా, ఐటీ, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డీఎస్సీ ద్వారా 16వేల మంది ఉపాధ్యాయులను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఎలా నియామకాలు చేపట్టగలిగారని ఆయన మంత్రి నారా లోకేష్‌ని ఆసక్తిగా అడిగారు. ఢిల్లీలో టీచర్ రిక్రూట్మెంట్ అంటేనే కోర్టుల్లో కేసులు, ఫిర్యాదులు, గందరగోళాలు సృష్టించేసి దాని జోలికెళ్లాలంటే జడిపించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా టీచర్ రిక్రూట్మెంట్ పూర్తి చేసిన లోకేష్‌కు అభినందనలు తెలిపారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ తాము డీఎస్సీ ద్వారా పరీక్ష నిర్వహించి ఎక్కడా ఎలాంటి చిన్న పొరబాట్లకు తావు లేకుండా 16వేలమందికిపైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామన్నారు. దీనిపైన కూడా ప్రతిపక్ష పార్టీ చాలా ఆరోపణలు

మిగతా 2లో...

# స్లీపర్ బస్సుల్లో భద్రతకు పెద్దపీట



- అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక తనిఖీలు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై రాజీలేని చర్యలు: మండిపల్లి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో స్లీపర్ బస్సుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

మిగతా 2లో...

# ప్రాంతం కాదు.. ప్రతిభే ముఖ్యం



- జోనల్ విధానం అమల్లో లేదు.. రాయలసీమకు అన్యాయం జరగలేదు: మంత్రి ఆనం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలోని దేవాలయాల్లో అర్చకులు, వేద పండితులు, పరిచారకులు, ఇతర ధార్మిక సిబ్బంది నియామకాల్లో జోనల్ విధానం మిగతా 2లో...

# పోర్టులు, ఫిషింగ్ హార్బర్లకు మహర్దశ



- మౌలిక వసతుల సమస్యలకు త్వరలో పరిష్కారం
- పెండింగ్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేస్తాం: బీసీ జనార్దన్ రెడ్డి

మిగతా 2లో...

# కూటమి పాలనలో ప్రభుత్వ బడులకు ఆదరణ



- గత వైసీపీ హయాంలో ఫేక్ డేటాను తొలగించాం
- శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ప్రజాప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల మూసివేత, గత మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు వివరాలపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. మిగతా 2లో...

# మున్సిపల్ హోదాకు ఇప్పట్లో నో!



- 25 వేలకుపైగా జనాభా ఉన్నా.. పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చే ప్రతిపాదన లేదు
- జనాభా గణన పూర్తయ్యాకే పట్టణీకరణపై నిర్ణయం: మంత్రి నారాయణ

మిగతా 2లో...

# హైకోర్టులో 'మీడియేషన్'.. 'ఆర్బిట్రేషన్' సెంటర్లు!



- ఏవో పోస్టుకూ కేబినెట్ ఆమోదం.. సత్వర న్యాయ సేవలకు చర్యలు
- పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి: మంత్రి ఫరూక్

మిగతా 2లో...

# స్థానిక పాలనలో బీసీ పవర్!



- 34% రిజర్వేషన్లతో రాజకీయ ప్రాతినిధ్యానికి బలం
- జెడ్పీల సంఖ్య 28కి పెంపు.. మేయర్లు, ఛైర్మన్లకు ఇక ప్రత్యక్ష ఎన్నికలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించే దిశగా రాష్ట్ర కేబినెట్ తీసుకున్న తాజా నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ నిర్ణయించడం బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని లోకేష్ తెలిపారు. ఏపీ పంచాయతీ రాజ్ చట్టం-1994కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు నిర్ణయం తీసుకోవడం కీలక పరిణామమన్నారు.

మిగతా 2లో...

# కొబ్బరి రైతుకు అండగా సర్కారు



- కొత్త మొక్కకు రూ.1,000 సాయం..
- కాలువల పూడికతీతకు చర్యలు
- కోకో, అరటి, కూరగాయల అంతర పంటలతో అదనపు ఆదాయం
- శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : కోనసీమలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించడంతో పాటు కాలువలు, డ్రెయిన్ల పూడికతీత ద్వారా సమస్య మూలాలను పరిష్కరించేందుకు

మిగతా 2లో...

# హంద్రీ-నీవాకు భారీ నిధుల వరద!



- ఫేజ్-2 పనులకు రూ.1,323.75 కోట్ల అనుమతి
- రాయచోటి పరిధిలో రూ.350 కోట్లతో కాలువ పనులు..
- 25 వేల ఎకరాలకు నీటి భరోసా

2 లో

# బోగస్ జీఎస్టీ ఇన్‌వాయిస్‌లపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించినట్లు చెప్పారు.

ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఇన్‌వాయిస్‌లు జారీ చేయడం, అక్కడి నుంచి మరో రాష్ట్రానికి, తిరిగి రాష్ట్రానికి ఇన్‌వాయిస్‌లు మార్చడం వంటి కార్యకలాపాలు చక్రీయ విధానంలో జరుగుతున్నాయని మంత్రి వివరించారు. రాష్ట్ర పరిధిని దాటి లావాదేవీలు జరిగినప్పుడు దర్యాప్తులో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయని, ఈ వ్యవహారాల్లో పొరుగు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

బోగస్ ఇన్‌వాయిస్‌ల వ్యవహారాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన పన్నులను రికవరీ చేస్తున్నామని చెప్పారు.

బోగస్ ఇన్‌వాయిస్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే ఏ చర్యనూ ప్రభుత్వం సహించబోదని పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై తీవ్ర స్థాయిలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మెగా డీఎస్సీ.. భేష్!




(మొదటి పేజీ తరువాయి)

చేసి విఫలమైందన్నారు. కోర్టుల్లో సైతం వారు ఎక్కడా చిన్న అక్రమం జరిగినట్లు ఆధారాలు చూపించలేకపోయారన్నారు. త్వరలో మరో 3వేల మందికి పైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. విద్యాశాఖ తనకు ఎంతో ఇష్టమైన శాఖని, విద్యాశాఖలో వినూత్న విధానాలు అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు. మొట్టమొదటి సారి ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి ఇదో ఉదాహరణ అన్నారు. ఉపాధ్యాయుల కార్యకలాపాలు, విద్యా శాఖలో మొత్తం కార్యకలాపాలన్నీ పర్యవేక్షించడానికి లీప్ యాప్ రూపొందించామన్నారు.

# స్లీపర్ బస్సుల్లో భద్రతకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 16 ప్రభుత్వ, 835 ప్రైవేట్ స్లీపర్ బస్సులు నమోదై ఉన్నాయని మంత్రి తెలిపారు. స్లీపర్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, కేంద్ర మోటారు వాహనాల నిబంధనల్లోని రూల్ 128ను కచ్చితంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

స్లీపర్ బస్సుల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరించారు. మానవ తప్పిదాల కారణంగా జరిగే ప్రమాదాలను నివారించేందుకు కఠినమైన నియమ నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రభుత్వం ఏమాత్రం రాజీ పడటం లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# పోర్టులు, ఫిషింగ్ హార్బర్లకు మహర్దశ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని పోర్టులు, ఫిషింగ్ హార్బర్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆర్అండ్‌బీ, ఐఅండ్‌ఐ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంగళవారం పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల్లో కోల్డ్ స్టోరేజ్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం నేలటూరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధుల కింద రూ. 25 కోట్లు అందించేందుకు అంగీకరించిందని చెప్పారు.

ఇప్పటికే రూ. 15 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, పెండింగ్ అంశాలను పరిష్కరించి మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేస్తామని, మంచినీళ్లపేట ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌ను ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌గా మార్చినట్లు వివరించారు.

పూడిమడక ఫిషింగ్ హార్బర్‌కు సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు కావాల్సి ఉందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీర ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉందని, రాష్ట్రంలో చేపట్టిన అన్ని పోర్టులు, ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తామని బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.

# కూటమి పాలనలో ప్రభుత్వ బడులకు ఆదరణ

(మొదటి పేజీ తరువాయి)


ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. గత రెండేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను మూసివేయలేదు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు 2022–23 ఏడాదిలో 7.6 శాతం తగ్గాయి. 2023–24 ఏడాదిలో 3.03శాతం తగ్గాయి. 2024–25లో 3.24 శాతం తగ్గాయి. ఇవి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగాయి. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవకతవకలను నివారించాం. నకిలీ డేటాను తొలగించాం. దీంతో 2025–26లో 1.69 శాతం ప్రవేశాలు తగ్గాయి. 2026–27 ఏడాదికి వచ్చేసరికి 0.94శాతం ప్రవేశాలు పెరిగాయని మంత్రి చెప్పారు.

# స్థానిక పాలనలో బీసీ పవర్!

(మొదటి పేజీ తరువాయి)

నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో మేయర్లు, చైర్మన్లను ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకునేలా నిర్ణయం తీసుకోవడం ద్వారా స్థానిక సంస్థలకు మరింత స్థిరమైన పాలన అందుతుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న 13 జిల్లా పరిషత్‌లను 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతో పాలనా వికేంద్రీకరణకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. బీసీల రాజకీయ సాధికారతతో పాటు స్థానిక సంస్థల బలోపేతం, ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కీలక ముందడుగుగా నిలుస్తాయని నారా లోకేష్ పేర్కొన్నారు.

# బీసీలకు రాజ్యాధికార బాట!



(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ, పట్టణ ప్రాంతాలను గాంధీజీ స్ఫూర్తితో అభివృద్ధి చేయడానికి కూటమి అంతా కలిసి కట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు బీసీలే వెన్నెముక :** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను, గ్రామీణ వ్యవస్థను, వ్యవసాయాన్ని, చేతివృత్తులను నిలబెట్టింది బీసీ సమాజమేనని సీఎం కొనియాడారు. రాష్ట్రంలో 50.42 శాతం ఉన్న బీసీల శ్రమకు, చీరను నేసి అగ్గిపెట్టెలో పెట్టే అద్భుత నైపుణ్యానికి సాంకేతికతను జోడించి వారి శక్తిని ప్రపంచానికి అందిస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా మార్చి విద్యకు మెరుగైన బాటలు వేస్తామన్నారు. విద్య, నైపుణ్యం, ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్లు, రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కేవలం రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మాత్రమే అభివృద్ధి కాదని, ఆర్థిక అసమానతలు లేకుండా జీవన ప్రమాణాలు పెంచుతూ చివరి వ్యక్తిని ముందుకు తేవడమే అసలైన అభివృద్ధి అని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సామాజిక న్యాయం సాధించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు మాత్రమే అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఎంపీటీసీ నుంచి ఎంపీగా అవకాశం :** 1984లో ఎన్టీఆర్ స్థానిక సంస్థలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తన హయాంలో 'యాక్ట్ ఆఫ్ 5' కింద బీసీలకు 34 శాతం మేర రిజర్వేషన్లు పెంచామన్నారు అదే కోటా ప్రకారం 1995, 2001, 2006, 2013 స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. పార్టీ ప్రోత్సహించి స్థానిక సంస్థల్లో భాగస్వామ్యం కల్పిస్తే క్షేత్రస్థాయి నుంచి నేతలుగా ఎదుగుతారని, కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీటీసీ బస్తిపాటి నాగరాజును ఎంపీగా చేసి సముచిత న్యాయం చేశామని ఉదహరించారు. పంచాయతీల నుంచి కేంద్ర మంత్రివర్గం వరకు బీసీలకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

**కోర్టుల్లో కేసులు వేస్తే చరిత్ర హీనులే :** శాసనసభలో ఈ ప్రకటన చేయగానే వైసీపీ కోర్టుల్లో కేసులు వేసేందుకు సిద్ధంగా ఉంటుందని సీఎం వ్యాఖ్యానించారు. మెగా డీఎస్సీ విషయంలోనూ ఇదే తరహాలో వందలాది కేసులు వేశారని తెలిపారు. ఈ రిజర్వేషన్ల విషయంలో కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికైనా వైసీపీ నేతలు హాజరవుతారని భావించానని, కానీ రాకపోవడం దారుణమని సీఎం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా జాతీయ జెండా ఎగురవేయకుండా నిర్లక్ష్యం చేస్తూ అవమానించిన వ్యక్తులను ఏమనాలని ప్రశ్నించారు. గత పాలకుల పై కేసులు 20 ఏళ్లుగా కింది కోర్టుకు, పైకోర్టుకూ ఊగిసలాడుతూనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. 2019లో గత పాలకులు బీసీ రిజర్వేషన్ల విషయంలో 176 జీవో తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీం కోర్టుకు కూడా అప్పీలు చేయకుండా వదిలేశారని సీఎం విమర్శించారు. 559, 560 జీవోల ద్వారా రిజర్వేషన్‌లను 34 శాతం నుంచి 24.15 శాతానికి తగ్గించి, 16,800 మంది బీసీ నాయకత్వానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. బీసీలకు ద్రోహం చేయడంలో వైసీపీ నెంబర్ వన్ అని ధ్వజమెత్తారు. గత పాలకులు బీసీలపై కక్షగట్టి, తమ వెనుక లేరన్న భావనతో ఇబ్బందులు పెట్టారని సీఎం తెలిపారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి బీసీ నేతలపై కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే కుర్రాడిని పెట్రోలు పోసి తగులబెట్టారని, టీడీపీకి మద్దతిస్తున్నారన్న కారణంతో తోట చంద్రయ్య గొంతుపై కత్తిపెట్టారని, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య ప్రాణాలు కోల్పోయినా సిద్ధాంతాలను వదులుకోలేదని గుర్తుచేశారు. చివరికి బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రసంగం ముగించగానే ముఖ్యమంత్రి వద్దకు బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి అసెంబ్లీ సమావేశ మందిరంలో కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాంతం కాదు.. ప్రతిభే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)



అమల్లో లేదని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ప్రాంతీయత కంటే వేద, ఆగమ పరిజ్ఞానం, అర్హత, ప్రతిభ, మెరిట్‌కే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ వాల్మీకి పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రధాన దేవాలయాల్లో అ–ర్చకులు, వేద పండితుల నియామకాల్లో రాయలసీమ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందన్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదన్నారు.

ఇటీవల భర్తీ చేసిన 344 పోస్టుల్లో 172 పోస్టులను రాయలసీమ ప్రాంతంలోని ప్రధాన దేవాలయాల్లో భర్తీ చేసినట్లు మంత్రి వివరించారు. శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి ప్రధాన దేవాలయాల్లో ఖాళీలు ఏర్పడినప్పుడు నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి అర్హులైన వేద, ఆగమ పండితులను పూర్తి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

ఇటీవల జరిగిన నియామకాల్లో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు చెందిన వేద, ఆగమ పండితులను ఎంపిక కమిటీల్లో సభ్యులుగా నియమించి వారి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. సుమారు 1,400 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగా, కేవలం 15 మందిని ఎంపిక చేయాల్సి రావడంతో పోటీ తీవ్రంగా ఉందన్నారు. ఒకటి, రెండు మార్కుల తేడాతో కూడా ఎంపికలు జరిగాయని తెలిపారు.

రాయలసీమ ప్రాంతం నుంచి 1,431 దరఖాస్తులు వచ్చాయని, అర్హత సాధించిన వారిలో 172 మందికి అవకాశం లభించిందని మంత్రి పేర్కొన్నారు. వేదం, సంస్కృతం, ఆగమ పరిజ్ఞానం తదితర అంశాల ఆధారంగానే ఎంపికలు చేపట్టినట్లు వివరించారు.

నియామక ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్‌తో అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులకు కూడా రికార్డింగ్ చూపించే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలకు సంబంధించిన నియామకాల్లోనూ అర్హత, వేద పరిజ్ఞానం, మెరిట్ ఆధారంగానే ఎంపికలు జరిగాయని తెలిపారు.

రాయలసీమలోని జోన్–4 పరిధిలో ప్రధాన దేవాలయాల్లో మొత్తం 440 పోస్టులు ఉండగా, ప్రస్తుతం 245 మంది పనిచేస్తున్నారని, ఇంకా 147 ఖాళీలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ ఖాళీలను కూడా నిబంధనల ప్రకారం త్వరలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ప్రధాన దేవాలయాల్లో భక్తులకు శాస్త్రోక్తంగా, ఆగమబద్ధంగా సేవలు అందించాలంటే నైపుణ్యం కలిగిన అర్చకులు, వేద, ఆగమ పండితులు అవసరమని మంత్రి అన్నారు. రాయలసీమతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా పూర్తి పారదర్శకతతో, మెరిట్ ఆధారంగా నియామకాలు చేపడుతున్నామని ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# కొబ్బరి రైతుకు అండగా సర్కారు

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతుండగా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే 0.36 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతోందని మంత్రి తెలిపారు. కోనసీమ జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు కౌలు రైతుల ద్వారా సాగవుతున్నాయని వివరించారు.

గత ఐదేళ్లుగా కాలువల్లో సక్రమంగా పూడికతీత చేపట్టకపోవడంతో సముద్రపు ఉప్పునీరు బ్యాక్ వాటర్ రూపంలో వెనక్కి వచ్చి నేలలో లవణీయత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రభావంతో పైకి ఆరోగ్యంగా కనిపించే కొబ్బరి చెట్లు కూడా అకస్మాత్తుగా కుంగిపోయి చనిపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించానని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దెబ్బతిన్న ప్రతి కొబ్బరి మొక్క స్థానంలో కొత్త మొక్క నాటేందుకు ఒక్కో మొక్కకు రూ. 1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కొత్త మొక్కలు నాటడంతోనే సమస్య పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించకుండా ఎన్ని మొక్కలు నాటినా, ఎంత పెట్టుబడి పెట్టినా ఆశించిన ఫలితం ఉండదన్నారు.

అందుకే సమస్యకు మూలమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొదటి విడతలో శంకరగుప్తం కాలువ పనులకు నిధులు కేటాయించామని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రెండు, మూడు నియోజకవర్గాల్లో ఉప్పునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన కాలువలను కూడా ఒక సమగ్ర ప్రాజెక్టుగా చేపట్టి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

కొబ్బరి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కొబ్బరి అభివృద్ధి మండలి (జఅదీ) సహకారంతో 2017–18 నుంచి 2024–25 వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5,250 హెక్టార్లను పథకం పరిధిలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కొత్త కొబ్బరి తోటల విస్తరణకు హెక్టారుకు రూ. 56 వేల సబ్సిడీని రెండేళ్లలో రూ. 28 వేల చొప్పున రెండు సమాన వాయిదాల్లో అందిస్తున్నామన్నారు. ఉద్యానవన తోటల విస్తరణకు సంబంధించిన కార్యక్రమం కింద గుంటలు తవ్వడం, మొక్కలు నాటడం, సాగు పరికరాలు తదితరాలకు మూడు సంవత్సరాల పాటు హెక్టారుకు రూ. 2,47,950 వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందన్నారు.

కోనసీమలో కొబ్బరి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రాంతీయ కొబ్బరి బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేంద్ర మంత్రికి లేఖ రాశారని మంత్రి గుర్తుచేశారు. కేంద్రంలోని కొబ్బరి బోర్డు సహకారంతో కొత్త ప్లాంటేషన్లను ప్రోత్సహించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

కొబ్బరి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అంతర పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని అచ్చెన్నాయుడు చెప్పారు. పామాయిల్ తోటల్లో మాదిరిగానే కొబ్బరి తోటల్లో కోకో, అరటి, కూరగాయలు వంటి అంతర పంటలు సాగు చేస్తే రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కోనసీమలో దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించాలన్నదే మా లక్ష్యం. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా దీనికి ఒక నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకుని పనిచేస్తాం. కొత్త మొక్కలు నాటించడంతో పాటు ఉప్పునీటి సమస్యకు కారణమైన కాలువలు, డ్రెయిన్ల సమస్యను కూడా పరిష్కరించి కొబ్బరి రైతులకు శాశ్వత భరోసా కల్పిస్తాం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# మేయర్.. చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు!

- **13 నుంచి 28కి జెడ్పీలు.. అక్టోబర్‌లోగా స్థానిక ఎన్నికలు**
- **స్థానిక పాలన బలోపేతం.. ప్రజలకు చేరువగా పరిపాలన**


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక పాలనను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర కేబినెట్ మంగళవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ఇకపై ప్రజలు నేరుగా ఎన్నుకునేలా ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో మేయర్, చైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ తీర్మానించింది. అదే సమయంలో గతంలో అమలులో ఉన్న విధానాన్ని పునరుద్ధరిస్తూ ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం చేయాలని నిర్ణయించింది. తద్వారా పట్టణ స్థానిక సంస్థల్లో పాలనకు మరింత స్థిరత్వం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

**13 నుంచి 28కి జెడ్పీలు :** జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 13 జిల్లా పరిషత్‌ల సంఖ్యను 28కి పెంచాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రతి జిల్లాకు జిల్లా పరిషత్ ఏర్పాటు చేసేలా అవసరమైన కార్యాచరణను చేపట్టాలని అధికారులను ఆదేశించింది. పరిపాలనను మరింత వికేంద్రీకరించి ప్రజలకు పాలనను చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**అక్టోబర్‌లోగా స్థానిక ఎన్నికలు :** స్థానిక సంస్థల ఎన్నికలను ఈ ఏడాది అక్టోబర్‌లోగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ. 16,500 కోట్ల నిధులు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధుల పాలనను పునరుద్ధరించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం కలుగుతుందని ప్రభుత్వం పేర్కొంది.

# మున్సిపల్ హోదాకు ఇప్పట్లో నో!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 25 వేలకుపైగా జనాభా కలిగిన ప్రధాన గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం అధిక జనాభా ఉన్న గ్రామ పంచాయతీలను పురపాలక సంఘాలుగా ఉన్నతీకరించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం పరిశీలనలో లేదని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని వివరించారు. కేవలం ఒక గ్రామ పంచాయతీ జనాభా 25 వేలు దాటిందనే కారణంతో దానిని మున్సిపాలిటీగా మార్చే నిర్ణయం తీసుకోబోమని తెలిపారు.

**2027 తర్వాతే సమగ్ర పరిశీలన :** దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనాభా గణన ప్రక్రియ పూర్తయ్యే వరకు గ్రామాలు, పట్టణాల హద్దులు, హోదాల్లో మార్పులు చేయవద్దని కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న జనాభా గణన ప్రక్రియ 2027 మార్చి 31 నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.

కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా అప్పటి వరకు రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చే ప్రక్రియ చేపట్టబోమని స్పష్టం చేశారు. జనాభా గణన పూర్తయిన తర్వాతే ఈ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

**జనాభాతో పాటు ఇతర అంశాలకూ ప్రాధాన్యం :** భవిష్యత్తులో పంచాయతీలను పురపాలక సంఘాలుగా ఉన్నతీకరించే అంశాన్ని కేవలం జనాభా ఆధారంగా నిర్ణయించబోమని మంత్రి నారాయణ వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో పట్టణీకరణ స్థాయి, జనాభా పెరుగుదల, మౌలిక వసతుల లభ్యత, పరిపాలనా అవసరాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.


"25 వేలకుపైగా జనాభా ఉన్న ప్రతి పంచాయతీని మున్సిపాలిటీగా మార్చే ప్రతిపాదన ప్రస్తుతం లేదు. జనాభా గణన పూర్తయ్యే వరకు ఎలాంటి మార్పులు చేయవద్దని కేంద్రం సూచించింది. 2027 మార్చి 31 తర్వాత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, అవసరమైతే మున్సిపాలిటీలుగా ఉన్నతీకరణపై నిర్ణయం తీసుకుంటాం" అని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు గుంటూరు నేతల ఘన స్వాగతం



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి విశాఖపట్నం విచ్చేసిన నితిన్ నబీన్‌కు గుంటూరు జిల్లా ముఖ్య నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ప్రత్యేకతను ప్రతిబింబించే వాణిజ్య పంటలు మిర్చి, పసుపు ప్రాధాన్యతను జిల్లా నాయకులు నితిన్ నబీన్‌కు వివరించారు. అలాగే గుంటూరు సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా గౌతమ బుద్ధుని జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రాంగణంలోని ఎగ్జిబిషన్ స్టాళ్లను నితిన్ నబీన్ సందర్శించారు. గుంటూరు జిల్లాకు సంబంధించిన ప్రదర్శన స్టాల్‌ను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన వ్యవసాయ, సాంస్కృతిక విశేషాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జిల్లా ఇన్‌చార్జి యాళ్ల దొరబాబు, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ శివమకుటం, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# బీజేపీ ఉపాధ్యక్షులుగా పురందేశ్వరీ, రామ్ మాధవ్ నియామకంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ 65 మందితో ప్రకటించిన నూతన జాతీయ కార్యవర్గంలో జాతీయ ఉపాధ్యక్షులుగా ఏపీకి చెందిన రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరీ, రామ్ మాధవ్ మరియు సంయుక్త సమన్వయకర్తగా విష్ణువర్ధన్ రెడ్డిలకు సముచిత స్థానం కల్పించడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ జీవితంలో ఒక్కో మెట్టు ఎదుగుతూ కష్టపడి అత్యున్నత స్థాయికి చేరుకోవడం గొప్ప విషయమని కొనియాడుతూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశ ప్రగతికి, వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాల సాధనకు మరింత ఉత్సాహంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

# హైకోర్టులో 'మీడియేషన్'.. 'ఆర్బిట్రేషన్' సెంటర్లు!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో మీడియేషన్ సెంటర్ మరియు ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోద ముద్ర వేయడం జరిగిందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన అంశాలకు ఆమోద ముద్ర వేసిన విషయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. 14 మంది సిబ్బందితో మీడియేషన్ సెంటర్ తో పాటుగా 15 మంది సిబ్బందితో ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేయడం జరిగిందన్నారు. హైకోర్టులో పరిపాలన సౌలభ్యం కోసం ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ )పోస్టును డైరెక్టరేట్ ఆఫ్ ప్రిజన్స్ క్రింద పనిచేస్తున్న పీపీ లేదా ఏపీపీ ద్వారా డిప్యుటేషన్ పై భర్తీ చేయడానికి కూడా మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని మంత్రి ఫరూక్ తెలిపారు. రాష్ట్రంలో న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, విస్తృత చర్యలు తీసుకోవడంలో భాగంగా పరిపాలనాపరంగా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి, సత్వర న్యాయానికి ప్రత్యేకంగా దృష్టి సారించి న్యాయ శాఖకు సంబంధించిన అన్ని విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే హైకోర్టులో "రిజిస్ట్రార్" ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశామన్నారు. న్యాయ సేవలను విస్తృతం చేయడం ద్వారా న్యాయ స్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# సింహాచలేశుని దర్శించుకున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విశాఖపట్నం వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మంగళవారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. సింహాచలం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అ-ర్చకులు స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు.

నితిన్ నబిన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆయనకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు నితిన్ నబిన్ వెంట ఉన్నారు.

సింహాచలం దర్శనం అనంతరం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబిన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, రాబోయే కార్యాచరణపై పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా "జనసేన వీర మహిళల" ప్రత్యేక పాట విడుదల!



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళలు రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి, క్రియాశీలక పాత్ర పోషించేలా, జనసేన పార్టీ వీర మహిళల్లో మరింత స్ఫూర్తి నింపేందుకు రూపొందించిన "కదిలింది ఇక జనసేన... కదం తొక్కు వీర మహిళ" అనే ప్రత్యేక పాటను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో విడుదల చేసి ఆసక్తిగా విన్నారు.. కృష్ణా-పెన్నా రీజినల్ కోఆర్డినేటర్ రావి సౌజన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ భవానీపురం 43వ డివిజన్ జనసేన పార్టీ కోఆర్డినేటర్, విజయేశ్వర స్వామి దేవాలయ బోర్డు మెంబెర్ ఆలమూరి శ్రీదేవి నిర్మించిన ఈ పాటను మంత్రి దుర్గేష్ ప్రశంసించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా మహిళలు రాజకీయాల్లో మరింతగా రాణించాలనే ఉన్నతమైన లక్ష్యంతో, జనసేన పార్టీ వీర మహిళల సాహసాన్ని, ప్రజాస్వామ్య పోరాటంలో వారి కీలక పాత్రను గుర్తుచేస్తూ స్ఫూర్తిని రగిలించేలా ఈ పాటను రూపొందించడం అభినందనీయం. మహిళా శక్తికి, వారి పోరాట పటిమకు ప్రతీకగా నిలిచేలా ఈ గీతం ఎంతో అద్భుతంగా, స్ఫూర్తిదాయకంగా ఉంది" అని కొనియాడారు.

# గాయత్రి - త్రీసాలకు అర్జున

న్యూఢిల్లీ: జాతీయ క్రీడల మంత్రిత్వశాఖ క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లకు క్రీడా పురస్కారాలను ప్రకటించింది. ఇందులో 17 మంది క్రీడాకారులను ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు ఎంపిక చేయగా.. ఒకరికి జీవితకాల సాఫల్య పురస్కారానికి, ముగ్గురు కోచ్‌లకు ద్రోణాచార్య అవార్డులకు మరో ఇద్దరికి ద్రోణాచార్య లైఫ్ టైం కేటగిరీ అవార్డులు అందజేయనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపింది. ప్రపంచ కప్ విజేత చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గాయత్రి గోపీచంద్, గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత బాక్సర్ నరేందర్ సహా 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులకు ఎంపిక చేసింది. అర్జున అవార్డు నామినేషన్ల జాబితాలో గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీ, గాయత్రి గోపీచంద్ మహిళల డబుల్స్ భాగస్వామి త్రీసా జోలీ, డెకాథ్లెట్ మరియు హై జంపర్ తేజస్విన్ శంకర్, మరియు యువ బధిర రైఫిల్ షూటర్ ధనుష్ శ్రీకాంత్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. అర్జున అవార్డుకు సెలెక్షన్ కమిటీ మొత్తం 24 మంది పేర్లను సిఫార్సు చేయగా.. 17 మంది పేర్లను షార్ట్ లిస్ట్ చేసింది.

# పరిశ్రమల్లో పచ్చని సంకల్పం

- **పకడ్బందీగా 33 శాతం గ్రీన్ కవర్ ప్రణాళికలు**
- **మొదటి దశలో 26 పరిశ్రమల్లో 14 రోజుల ప్రత్యేక కార్యచరణ**
- **129 ఎకరాల్లో 43,300 మొక్కలు నాటిన పారిశ్రామిక వర్గాలు**
- **మిగిలిన పరిశ్రమల్లో కట్టుదిట్టంగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రివర్యుల దిశా నిర్దేశం**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పారిశ్రామిక ప్రగతితోపాటు పర్యావరణ పరిరక్షణకు సమ ప్రాధాన్యమివ్వాలన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలు కార్యరూపం దాలుస్తున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం అనే మూల సిద్ధాంతాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ప్రతి పరిశ్రమ తన పరిధిలోని భూభాగంలో 33 శాతం పచ్చదనంతో నింపాలన్న నిబంధనను కచ్చితంగా అమలు చేసే విధంగా రూపొందించిన ఈ ప్రణాళిక ఫలితాన్నిస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మొదటి దశలో జిల్లాకు ఒకటి చొప్పున పరిశ్రమను ఎంపిక చేసి రెండు వారాల్లో గ్రీన్ కవర్ లక్ష్యాలను చేరుకునేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జులై 28వ తేదీన ప్రారంభమైన ఈ డ్రైవ్ ఆగస్టు 11వ తేదీ నాటికి ముగిసింది. 26 జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన 26 పరిశ్రమలు నిర్దేశిత లక్ష్యాన్ని కేవలం 14 రోజుల్లో సాధించాయి. మొత్తం 129 ఎకరాల విస్తీర్ణంలో 43,300 మొక్కలు నాటారు. స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల సారం ఆధారంగా అనువైన దేశీయ జాతులతోపాటు పండ్ల మొక్కలు, సుందరీకరణకు ఉపయోగించే మొక్కలు, వేప, కానుగ, రావి, నేరేడు తదితర జాతులకు ప్రాధాన్యత ఇచ్చారు.

భారీ పరిశ్రమలు విడుదల చేసే వాయు కాలుష్యాన్ని హరించి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందించే సంకల్పాన్ని పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకువెళ్తున్నారు. పరిశ్రమల ఉత్పాదకత, ఉపాధి కల్పనకే పరిమితం కాకుండా పర్యావరణ సమతుల్యత పాటించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ముందుకు తీసుకువెళ్లాల్సిన ఆవశ్యకతను చాటి చెబుతున్నారు. తొలి దశ 33 శాతం గ్రీన్ కవర్ విజయవంతంగా పూర్తి కావడంతో ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేస్తూ, రాష్ట్రంలో మిగిలిన పరిశ్రమలు కూడా గ్రీన్ కవర్ లక్ష్యంలో భాగస్వాములయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులకు పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశం చేశారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్--2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి శాఖ, ప్రతి పరిశ్రమ, బాధ్యతాయుతంగా కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# హంద్రీ-నీవాకు భారీ నిధుల వరద!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** హంద్రీ-నీవా సుజల స్రవంతి ఫేజ్-IIలో మిగిలిన మెయిన్ కెనాల్, సీసీ లైనింగ్, నీవా బ్రాంచ్ కెనాల్ తదితర పనులను పూర్తి చేసేందుకు రూ. 1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

హంద్రీ-నీవా మెయిన్ కెనాల్‌ను తొలుత లైనింగ్ లేకుండా నిర్మించడంతో డిజైన్ చేసిన 2,520 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి తెలిపారు. మిగిలిన కాలువ పనులతో పాటు సీసీ లైనింగ్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ కిమీ 400.500 నుంచి 485.300/490.000 వరకు మిగిలిన పనులకు రూ. 750.07 కోట్లు, అన్నమయ్య జిల్లాలో కిమీ 490.000 నుంచి 554.175 వరకు మెయిన్ కెనాల్ పనులతో పాటు అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నీవా బ్రాంచ్ కెనాల్ పనులకు రూ. 573.68 కోట్లు కేటాయించే ప్రతిపాదనకు అనుమతి లభించిందని వివరించారు.

రాయచోటి నియోజకవర్గ పరిధిలో కిమీ 490 నుంచి 535 వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ పనులు ఉన్నాయని తెలిపారు. వీటికి సుమారు రూ. 290 కోట్లు, అదనంగా రూ. 60 కోట్లతో కలిపి మొత్తం సుమారు రూ. 350 కోట్ల విలువైన పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు. కిమీ 463 నుంచి 554 వరకు మెయిన్ కెనాల్ పనులను ఒకే సింగిల్ ప్యాకేజీగా చేపట్టే ప్రతిపాదన ఉందని, అందులో 490--535 కిమీ పరిధిలోని పనులు కూడా భాగం కానున్నాయని చెప్పారు.

ఈ పనులు పూర్తయితే హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో పనిచేసి కేవీ పల్లి, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి, రాయచోటి, పీలేరు, చిత్తూరు ప్రాంతాలకు తాగునీటితో పాటు సాగునీటి అవసరాలను తీర్చేందుకు మరింత ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. సుమారు 25 వేల ఎకరాల పరిధిలో ఖాళీగా ఉన్న చెరువులను నింపి ప్రజలకు నీటి భరోసా కల్పిస్తామని తెలిపారు.

హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను అనుసంధానం చేసి మార్గమధ్యంలోని ఖాళీ చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు. రాయచోటి, అన్నమయ్య జిల్లా ప్రజల తాగునీరు, సాగునీటి అవసరాలకు హెచ్ఎన్ఎస్ఎస్ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరారు.

అన్నమయ్య జిల్లా ప్రజల చిరకాల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారీగా నిధులు కేటాయించి పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చొరవ, దూరదృష్టితో ఈ ప్రాంతానికి తాగునీరు, సాగునీటి భరోసా మరింత బలోపేతం కానుందని అన్నారు.

హెచ్ఎన్ఎస్ఎస్ మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు సాధ్యమైనంత త్వరగా నీటి ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# పేద విద్యార్థుల కోసం దేశంలోనే వినూత్న 'స్వాంతన' పథకం

- **అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ**
- **అనారోగ్యానికి గురైన విద్యార్థులను గుర్తించి సకాలంలో కార్పొరేట్ వైద్యం**
- **దురదృష్టవశాత్తు చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు బాసటగా స్వాశీతన పథకంతో రూ. 3 లక్షల ఆర్థిక సాయం**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దురదృష్టవశాత్తు అనారోగ్య కారణాలతో చనిపోయిన పేద విద్యార్థుల కుటుంబాలకు స్వాశీతన పథకంతో కూటమి ప్రభుత్వం బాసటగా నిలిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అనారోగ్య సమస్యలతో దురదృష్టవశాత్తు చనిపోయిన అంబేద్కర్ గురుకులాల విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రి స్వాశీతన చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి రూ. 3 లక్షల చొప్పున 7 మంది విద్యార్థుల కుటుంబాలకు రూ. 21 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో రూ. 5 కోట్లతో కార్పస్ నిధితో స్వాశీతన పథకం తీసుకొచ్చాం. అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో అనారోగ్యానికి గురైన విద్యార్థులను వెంటనే గుర్తించి సకాలంలో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నాం. దురదృష్టవశాత్తు చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు బాసటగా స్వాశీతన పథకంతో రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఇప్పటివరకు 11 మంది విద్యార్థుల కుటుంబాలకు బాసటగా రూ. 33 లక్షల విలువైన స్వాశీతన చెక్కులు పంపిణీ చేశాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ పేద విద్యార్థుల కోసం ఇలాంటి పథకం లేదు. పేద విద్యార్థుల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం. తల్లిదండ్రులు తమ పిల్లలకు బంగారు భవిష్యత్తును అందించేందుకు తమ ప్రేమానురాగాలకు దూరంగా హాస్టళ్లలో ఉంచి చదివిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. కూటమి ప్రభుత్వం వచ్చాక గురుకులాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం ముమ్మరంగా గాలింపు

- **అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బీ. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామానికి చెందిన మత్స్యకారుల బోటు సముద్రంలో గల్లంతైన ఘటనపై సీఎంఓ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. బోటులో ఉన్న ఎనిమిది మంది మత్స్యకారుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలను అధికారులను అడిగి సీఎం తెలుసుకున్నారు. గల్లంతైన బోటు, మత్స్యకారుల ఆచూకీ లభించే వరకూ గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆగస్టు 3న ఉదయం 10 గంటల సమయంలో ఓడలరేవు జెట్టి నుంచి మత్స్యకారుల బోటు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లిందని అధికారులు వివరించారు. ఉదయం 11 గంటల వరకు కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా సంబంధాలు కొనసాగగా, ఆ తర్వాత ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. బోటులో వీహెచ్ఎఫ్ సెట్‌తో పాటు మత్స్యకారుల వద్ద మొబైల్ ఫోన్లు కూడా ఉన్నట్లు అధికారులు వివరించారు. అదే రోజు సుమారు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోటు చేపల వేట ప్రాంతానికి చేరుకుని ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. 12వ తేదీ నాటికి బోటు తిరిగి రావాల్సి ఉన్నా రాలేదని... దీంతో వెంటనే ఆచూకీ కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టామని అధికారులు అన్నారు. కోస్ట్‌గార్డ్ నౌకలను అప్రమత్తం చేసి గాలింపు చేపడుతున్నట్లు కోస్ట్‌గార్డ్ కమాండెంట్ తెలిపినట్లు అధికారులు వివరించారు. కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల బోట్లను కూడా అప్రమత్తం చేసి గల్లంతైన బోటు ఆచూకీపై సమాచారం సేకరిస్తున్నామన్నారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, గాలింపు చర్యలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వారికి తెలియజేయాలని సీఎం ఆదేశించారు. మత్స్యకారుల సురక్షిత ఆచూకీ కోసం అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగించాలని, అవసరమైన ప్రతి చర్యను సమన్వయంతో చేపట్టాలని స్పష్టం చేశారు. బోటు ఆచూకీ లభించే వరకు కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో గాలింపు కొనసాగించాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# బీసీ రిజర్వేషన్లపై సీఎంకు బీసీ ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు



- **స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదంపై హర్షం**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రిమండలి కీలక నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కూటమి పార్టీలకు చెందిన బీసీ ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు శాసనసభలో ధన్యవాదాలు తెలిపారు.

అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి ప్రకటన అనంతరం బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు స్థానిక సంస్థల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేబినెట్ నిర్ణయం దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని బీసీ ప్రజాప్రతినిధులు అన్నారు. ఈ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు మరిన్ని రాజకీయ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

బీసీల సామాజిక, రాజకీయ సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని వారు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేబినెట్ సభ్యులకు కూటమి బీసీ ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# 12వ పీఆర్సీలో 29 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** 12వ పే రివిజన్ కమిషన్ లో ఉద్యోగులకు 29 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మకు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరింది.

12వ పీఆర్సీలో 29 శాతం ఫిట్‌మెంట్‌ను 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 2026 జూలై 31 నాటికి రావాల్సిన ఏరియర్స్‌ను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేసి, ఆగస్టు 1 నుంచి జీతాలతో కలిపి చెల్లించాలని కోరింది.

జూఏపై ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సంఘం విజ్ఞప్తి చేసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రాబోయే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలకు రిజిస్టర్ అయిన అన్ని ఉద్యోగ సంఘాలను ఆహ్వానించాలని కోరింది.

ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని, ప్రభుత్వం త్వరగా సానుకూల నిర్ణయాలు తీసుకుని ఉద్యోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కోరారు.

కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు రెహమాన్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రవి, ఉపాధ్యక్షులు రాజు, కోశాధికారి రాజు, నగర శాఖ కార్యదర్శి శంకర్, సహాయ అధ్యక్షులు అబ్దుల్లా, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి బదలాయింపుపై భగ్గుమన్న పాడి రైతులు

- భూ భారతి రికార్డుల మార్పుపై ఆగ్రహం..
- కలెక్టరేట్‌కు వేలాదిగా తరలివచ్చిన పాడి రైతులు
- కరీంనగర్ డెయిరీ భూములు తిరిగి డెయిరీ పేరుతోనే నమోదు చేయాలని డిమాండ్
- పెండింగ్ ప్రోత్సాహకం విడుదల చేయాలి..
- 50 శాతం సబ్సిడీపై రెండు పాడి పశువులు ఇవ్వాలి



**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ధరణి పోర్టల్ స్థానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్‌లో కరీంనగర్ డెయిరీకి సంబంధించిన భూములను తెలంగాణ స్టేట్ డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ పేరుపై మార్చడాన్ని నిరసిస్తూ పాడి రైతులు సోమవారం భారీ ఆందోళన చేపట్టారు. కరీంనగర్ డెయిరీ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు వేలాది మంది పాడి రైతులతో భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. డెయిరీని కాపాడాలంటూ రైతులు చేసిన నినాదాలతో పరిసరాలు మారుమోగాయి.కరీంనగర్ డెయిరీ చైర్మన్ డాక్టర్ చల్మెడ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో డెయిరీ పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు, పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ ఆధ్వర్యంలో డెయిరీ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో కరీంనగర్ డెయిరీ పేరుతో ఉన్న భూములను తమకు ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే భూ భారతి రికార్డుల్లో తెలంగాణ ఫెడరేషన్ పేరుపై మార్చారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే ఈ భూములను కరీంనగర్ డెయిరీ పేరుతో తిరిగి నమోదు చేయాలని డిమాండ్ చేశారు.డెయిరీని నమ్ముకుని లక్షలాది మంది పాడి రైతుల కుటుంబాలు జీవిస్తున్నాయని, డెయిరీ భూములను రైతుల ప్రయోజనాల కోసం, డెయిరీ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని కోరారు. కరీంనగర్ డెయిరీ నుంచి దేవాలయాలకు నెయ్యి, ప్రభుత్వ పాఠశాలలకు పాలు సరఫరా చేస్తున్నప్పటికీ, తమ కంటే ఎక్కువ కోట్ చేసిన ఫెడరేషన్‌కు సరఫరా ఆర్డర్లు ఇచ్చి డెయిరీ సరఫరాలను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పెండింగ్ ప్రోత్సాహకం విడుదల చేయాలి**

2018 నుంచి పెండింగ్‌లో ఉన్న లీటర్ పాలకు రూ.4 చొప్పున ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. అలాగే ప్రతి పాడి రైతుకు 50 శాతం సబ్సిడీపై రెండు పాడి పశువులను ప్రభుత్వం వెంటనే అందించాలని కోరారు. రైతుల నుంచి పాలను అధిక ధరకు కొనుగోలు చేసి, పాడి రంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**నోటీసులు ఇవ్వకుండానే భూముల బదలాయింపు: చైర్మన్**

కరీంనగర్ డెయిరీ చైర్మన్ డాక్టర్ చల్మెడ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కరీంనగర్ డెయిరీకి సంబంధించిన భూములను తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ధరణి రికార్డుల నుంచి తెలంగాణ ఫెడరేషన్ పేరుపై మార్చారని ఆరోపించారు. ఆగస్టు 3న ఆకస్మికంగా డెయిరీని ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారని తెలిపారు.కరీంనగర్ డెయిరీ రైతులదేనని, తమకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని స్పష్టం చేశారు. పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలే తమ ప్రధాన లక్ష్యమన్నారు. డెయిరీ నుంచి దేవాలయాలకు నెయ్యి, ప్రభుత్వ పాఠశాలలకు పాలు సరఫరా చేస్తున్నామని, అయితే ఫెడరేషన్‌కు సరఫరా ఆర్డర్లు ఇచ్చి తమ సరఫరాలను రద్దు చేయడం వల్ల డెయిరీపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు.డెయిరీకి సంబంధించిన భూములపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను గుర్తించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఈ నెల 22న సమావేశం ఏర్పాటు చేస్తానని, వినతిపత్రాన్ని ప్రభుత్వానికి పంపిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాల ఆధారంగా తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని చైర్మన్ వెల్లడించారు.

**రైతుల ప్రయోజనాలకే భూముల వినియోగం**

కరీంనగర్ డెయిరీకి సంబంధించిన భూములు డెయిరీ అభివృద్ధికి, పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి ఉపయోగపడేలా చూడాలని చైర్మన్ కోరారు. ధరణి రికార్డుల్లో కరీంనగర్ డెయిరీ పేరుతో ఉన్న భూములను భూ భారతి రికార్డుల్లో తెలంగాణ ఫెడరేషన్ పేరుపై మార్చడం వల్ల పాల ఉత్పత్తిదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.పాల ఉత్పత్తిదారులకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.4 కోట్ల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ప్రతి పాల ఉత్పత్తిదారుడికి 50 శాతం సబ్సిడీపై రెండు పాడి పశువులను అందించాలని కోరారు.కరీంనగర్ డెయిరీపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది రైతు కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, రైతులను వీధిన పడకుండా డెయిరీని పరిరక్షించే చర్యలు చేపట్టాలని పాడి రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



# మా భూములు మాకు కావాలి..

- తరతరాలుగా సాగుచేస్తున్న భూములపై హక్కుఎవరిది...
- గ్రీవెన్స్‌లోకలెక్టర్‌కు వినతిపత్రం అందించిన ముష్టిబండరైతులు



**భద్రాద్రికొత్తగూడెం ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** తరతరాలుగా సాగుచేసుకుంటూ వస్తున్న భూములపై హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామానికి చెందిన రైతుకుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి లభించిన ఇనాం భూములను కొందరు ఆక్రమించి రెవెన్యూరికార్డుల్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామంలోనిసర్వే నెంబర్114/3/8లో ఉన్న భూములపై వివాదం కొనసాగుతుంది. తమ తాతలు నిజాం పాలనలో వెట్టిచాకిరి చేసినందుకు అప్పటి పాలకులు 1947లో సుమారు 48మందికి ఇనాం భూములు ఇచ్చారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మాకుటుంబాలే ఆభూములనుసాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు.

**అసలు సమస్య ...రెవెన్యూ రికార్డు మార్పులతోనే**

తాము ఏళ్లతరబడి సాగుచేస్తున్న భూముల్లో అగ్రవర్ణాలకుచెందిన వ్యక్తులు ఆక్రమించి, పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందారని,వాటిఆధారంగా రైతుబంధు వంటి ప్రభుత్వ పథకాలు పొందుతన్నారని బాధితులు తెలిపారు.తరతరాలుగా సాగుచేస్తున్న భూములుతమ చేతి నుంచి జారిపోతే తమకుటుంబాలకు జీవనాధారం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భూములపైహక్కులు నిర్ధారించకుండా రెవెన్యూ రికార్డుల్లో జరిగిన మార్పులతో తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

**కలెక్టర్ గారు...న్యాయం చేయండి...**తమభూములపై సమగ్రరెవెన్యూ విచారణచేపట్టి పాత రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని కలెక్టర్ అంకిత్‌ను కోరారు. 1947నుంచి తమ కుటుంబాల సాగు వివరాలు, ఇనాం భూములకు సంబంధించిన ఆధారాలు పరిశీలించి అసలు హక్కుదారులుగా గుర్తించాలని కోరారు. అక్రమంగా పట్టాదారు పుస్తకాలు పొందినట్లు తేలితే వాటిని రద్దు చేసి, తమ పూర్వీకుల నుంచి సాగులో ఉన్న భూములను తమకు ఇప్పించాలని కోరారు. వారసులకు ఓఆర్‌సి ఇప్పించాలని, తరతరాలుగా భూమిని నమ్ముకోని సాగుచేస్తూ జీవిస్తున్న తమ కుటుంబాలను కాపాడాలని ముష్టిబండ గ్రామస్తులు కోరారు. ఫిర్యాదు అందించిన వారిలో కె.కాంతరాజు, ఎస్.మధు, కె.జగపతిరావు, కె.నాగేశ్వరరావు, కె.శ్యామ్‌కుమార్, ప్రభాకర్‌రావు, డి.మధు, కె.ధర్మరాజులు ఉన్నారు.

## కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ పథకాలను నిర్వీర్యం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నది



**ముస్తాబాద్, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈరోజు ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు రాచమడుగు సంతోష్ రావు పార్టీ రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ
కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలనేటువంటి కుట్ర చేస్తున్నదన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ప్రస్తుతానికైతే నిలిపివేయాలని హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో వారు మాట్లాడుతూ.... ఈ విషయమై హైకోర్టులో పిటిషన్ దాఖలైనప్పుడే ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రిన్సిపల్ సెక్రెటరీ ని, లా సెక్రటరీ పిలుచుకొని ఆ పిటిషన్ పై ఎలా ముందుకు వెళ్లాలో ఆలోచించకుండా ఈ పథకాలు నిర్వీర్యం చేయాలనే కుట్ర చేసిందని దీనివెనక రేవంత్ రెడ్డి హస్తం ఉందని వారు అన్నారు.
కేసీఆర్ పెట్టిన ఒక చరిత్రాత్మకమైన స్కీంలైన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ లని, ఈ పథకాల వెనుక కేసీఆర్ గారు ఒక లోతైన విశ్లేషణ చేసి పెట్టారని, ఉద్యమ సమయంలో గ్రామాల్లో తిరుగుతున్నటువంటి సందర్భంలో నిరుపేద గిరిజన, ఎస్సి, బిసి పేద ఆడబిడ్డల పెళ్లి చేయడానికి పడుతున్నటువంటి అవస్థలను కల్లారాచూసి, అలాగే గిరిజన ప్రాంతాల్లో చిన్నపిల్లలకు వివాహాలు చేయడాన్ని గమనించి ఆడబిడ్డ పెళ్లికి అండగా ఉంటూనే, బాల్యవివాహాలు అరికట్టాలనే ఆలోచనలతో మొదలు పెట్టిన పథకం ఇదని అన్నారు. ఈ పథకం ద్వారా దాదాపు 13 లక్షల పేద కుటుంబాలు లబ్ధి పొందాయని, ఇలాంటి మంచి పథకాన్ని ఆపాలని జరుగుతున్నటువంటి కుట్ర చూస్తే బాదేస్తుందని అన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి పెట్టి పథకం నిర్వీర్యం కాకుండా చూడాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పెద్ద మొత్తంలో ఉద్యమిస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, మాజీ పట్టణ అధ్యక్షుడు గూడూరి భరత్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎండి. నవాజ్, పట్టణ యూత్ అధ్యక్షుడు మిడిదొడ్డి యాదగిరి, కోడె శ్రీను, పల్లె సత్యం, శేఖర్ పాల్గొన్నారు..

## పీ.యం.జే. జ్యువెలర్స్ బందిపోటు దొంగల ముఠాపై పీడీ యాక్ట్

- ప్రధాన నిందితులైన ఐదుగురిపై నిర్బంధ ఉత్తర్వులు.. చర్లపల్లి జైలుకు తరలింపు



**కరీంనగర్, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** కరీంనగర్ పట్టణంలోని పీ.యం.జే. జ్యువెలర్స్‌లో జరిగిన సంచలన బందిపోటు దొంగతనం కేసులో ప్రధాన నిందితులపై కరీంనగర్ పోలీసులు కొరడా ఝుళిపించారు. నేర కార్యకలాపాలను అరికట్టడంతో పాటు ప్రజల భద్రతకు భరోసా కల్పించే చర్యల్లో భాగంగా ఐదుగురు ప్రధాన నిందితులపై సోమవారం పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) అమలు చేశారు.2026 మే 3న పీ.యం.జే. జ్యువెలర్స్‌లోకి చొరబడిన దుండగులు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపి సుమారు రూ.82 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ప్రధాన నిందితులైన రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీరా సింగ్ (41), రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమాన్ (23), సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్ (21), యాదవ్ అలియాస్ జైనుల్ అబ్దిన్ (33), మొహమ్మద్ ఆదిల్ ఖాన్ (31)పై సోమవారం పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను జిల్లా జైలులో నిందితులకు అందజేశారు. అనంతరం వారిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.నేర కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిలో భయాన్ని కలిగించడంతో పాటు నేరాలను నియంత్రించేందుకు చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని తెలిపారు.పీడీ యాక్ట్ అమలులో కీలకంగా వ్యవహరించిన కరీంనగర్ పట్టణ ఏసీపీ ఎన్. వెంకటస్వామి, కరీంనగర్ రెండో పట్టణ సీఐ కె. సృజన్ రెడ్డి, పీడీ సెల్ పండరి, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌లను పోలీస్ కమిషనర్ అభినందించారు.

# ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం

- ప్రజావాణిలో ఎంపీడీవో జశ్వంత్ కుమార్,తహసీల్దార్ సైదులు



**పాలేరు, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజావాణిలో దరఖాస్తు చేసిన ప్రతి అర్జీకి శాశ్వతమైన పరిష్కారం చూపించబడుతుందని కూసుమంచి ఎంపీడీవో తాటిపాముల జశ్వంత్ కుమార్,తహసిల్దార్ డి.సైదులు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించాలని సూచించిన మేరకు సోమవారం స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అధ్యక్షతన ఏర్పాటైన ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ కు సంబంధించి తొమ్మిది దరఖాస్తులు అందాయని, పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి మూడు, విద్యా శాఖకు సంబంధించి రెండు దరఖాస్తులు,హౌసింగ్ సంబంధించి ఒక దరఖాస్తు మొత్తం 15 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్జీదారునికి వెంటనే రసీదు ఇవ్వడం జరిగిందని వెల్లడించారు.అర్జీ దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారుల సమక్షంలో పరిష్కారానికి చొరవ తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 19 విభాగాలకు చెందిన అధికారులు హాజరయ్యారని, హాజరుకాని సంబంధిత శాఖల అధికారులపై జిల్లా ఉన్నతాధికారుల సూచన మేరకు శాఖా పరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జూపెడ- సుబ్లేడు డొంక రహదారి సర్వే చేయాలి

- సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి ..ప్రజావాణిలో అధికారులకు వినతి



**పాలేరు, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమలాయపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జూపెడ గ్రామం నుండి బడితండ (లక్ష్మీదేవిపల్లి తండా) మీదుగా హస్నాబాద్, సుబ్లేడు గ్రామాల వరకు గల ప్రభుత్వ నక్ష డొంకను సర్వే చేసి రహదారి సౌకర్యం కల్పించాలని జూపెడ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి అధికారులకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డొంక ద్వారా రాకపోకలు సాగించే అనేక మంది రైతులు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో రవాణా పూర్తిగా నిలిచిపోతుందని తెలిపారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డొంకను సర్వే చేసి పక్కా రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

## ఓదెలలో మండల ప్రజావాణి ప్రారంభం



**ఓదెల, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓదెల మండలంలో సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైంది. ఎంపీడీవో అనిల్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన ఆరు అర్జీలను అధికారులు స్వీకరించారు.హౌసింగ్--2, విద్య--1, నీటిపారుదల--1, రెవెన్యూ--1, పంచాయతీరాజ్--1 దరఖాస్తులు వచ్చాయి. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన అర్జీలను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించారు.ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజానాయక్, ఎస్సై సనత్‌కుమార్, ఎంపీఓ భాస్కర్, ఏఈ మోహన్‌నాయక్, వైద్యాధికారి షాహబాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

- రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు: అక్కనపల్లి భాస్కర్



**ముస్తాబాద్, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** భవన నిర్మాణ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అక్కెనపల్లి భాస్కర్ నూతన కమిటీ ఏర్పాటు చేశారు.కార్యక్రమం లో భవన నిర్మాణ కార్మికులు, అధిక సంఖ్య లో పాల్గొన్నారు.నూతన పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు.నూతనం గా ఎన్నుకోబడ్డ భవన నిర్మాణ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల టౌన్ అధ్యక్షులు గా సోమిశెట్టి నవీన్, ఉపాధ్యక్షులుగా షేక్ ముస్తఫా, గోట్ల వికాస్, ప్రధాన కార్యదర్శిగా అక్కెనపల్లి మల్లేశం, కోశాధికారులు తాళ్ల గణేష్ ,ఎండి బషీర్, కాదశివ సలహాదారులు గా పోతురాజుల రవి, ఎండి అనిష్ భోగసాయి, షేక్ బాబు, ఎదునూరి ప్రశాంత్, ఎదుల్లా భద్ర జహీర్, చిలుక నరసింహ, మల్యాల రాజయ్య, మాచరెడ్డి శివారెడ్డి, ఎండి ఇలియాస్ ఖాయాతి ,హనుమవ్వ, ఎస్ కే కాసింబి, సింగారం శ్రీనివాస్, బచ్చపల్లి కుమార్, ఎం.డి ముఖి పద్మ లక్ష్మి, రాజవ్వ, సుందర్ చందు, నరసయ్య రాజు, శంకరులు, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు..

## సుల్తానాబాద్ సభను విజయవంతం చేయాలి

**ఓదెల, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** సుల్తానాబాద్‌లో ఈ నెల 19న జరిగే సభకు ఓదెల మండల కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి కోరారు. సోమవారం ఓదెలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు సభకు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, సర్పంచులు అంబాల సారమ్మ, రాగిడి మంగా, పల్లె కనకయ్య, కనికిరెడ్డి సతీష్, గంగిశెట్టి ప్రభాకర్, తంగెళ్ల నరసింహారెడ్డి, రంగు మల్లేశం గౌడ్, చిట్ల రాము, గుగులోత్ నిమ్మ మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమ పథకాలను కొనసాగించాలి

- తహశీల్దార్‌కు మెమోరాండం సమర్పించిన బీఆర్ఎస్‌నాయకులు



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** పేదల సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరుతూ బీఆర్ఎస్‌నాయకులు సోమవారం తహశీల్దార్‌కుమెమోరాండం సమర్పించారు.బిఆర్ఎస్ పార్టీరాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపుమేరకు ఎంపి మద్దిరాజురవిచంద్ర,నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పిలుపుమేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ లక్ష్మీదేవిపల్లి బిఆర్ఎస్ మండలాధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు లక్ష్మీదేవిపల్లి తహశీల్దార్‌కు మెమోరాండం అందచేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎంతోమంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు ఆర్థికంగా అండగా నిలిచాయన్నారు. పేదకుటుంబాల్లో ఆడపిల్లల వివాహం భారంగా మారకుండా ఈపథకాలు ఎంతోమందికి సహాయపడ్డాయన్నారు. అలాంటిప్రజాసంక్షేమపథకాలను నిలిపి వేయాలని ప్రభుత్వం ఆలోచించడం సరైన నిర్ణయం కాదన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆర్థికసహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల దామోదర్,సురేష్, వినోద్, శ్రీను, శ్రీకాంత్‌నాయక్, మురళీ, దాము, మహేష్, శ్రీను, వెంకటేశ్వర్లు, శివ, శ్రీను, బట్టు రవి, మంగ్య, రమేష్, లావుడియా ప్రసాద్, రవి, శివ, చిన్న, నాగరాజు, చిన్ని, వంశీ, చిన్ను, పూర్ణాచారి తదితరులు పాల్గోన్నారు.

## చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా విద్యావకాశం

- పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



**కొత్తగూడెం, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** చదువు మధ్యలో మానేసినవారికి ఓపెన్ స్కూల్ ద్వారావిద్యావకాశం ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈసందర్భంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టిఓఎస్ఎస్)ఆధ్వర్యంలో 2026-27విద్యాసంవత్సరానికి సంబంధించిన పోస్టర్, ప్రాస్పెక్టస్‌ను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ విద్యాచందన సోమవారంఆవిష్కరించారు.అనంతరం ఆయనమాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు, యువత వివిధ కారణాల వల్ల సాధారణ పాఠశాల విద్యను కొనసాగించలేకపోయిన వారందరికీ తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ ద్వారా తిరిగి విద్యను కొనసాగించే అవకాశం ఉందన్నారు. విద్యకు దూరమైనప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోనితమ విద్యార్హతలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఓపెన్‌స్కూల్ ద్వారా చదువును కొనసాగిస్తూ భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, టిఓఎస్ఎస్ సిబ్బంది, సమన్వయకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## ఇండియన్ పోలీస్ మెడల్ గ్రహీత సీఐ నిరంజన్ రెడ్డికి ఘన సత్కారం



**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) :** కరీంనగర్ రూరల్ సీఐ అనుముల నిరంజన్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నక్సల్స్ కార్యకలాపాల నియంత్రణతో పాటు అసాంఘిక శక్తుల కట్టడిలో ఆయన అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఇండియన్ పోలీస్ మెడల్ పురస్కారం లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సీఐ నిరంజన్ రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం పోలీస్ స్టేషన్‌లో 4వ డివిజన్ నాయకులు, దుర్శేడ్ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు సీఐ నిరంజన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.సమాజ హితం కోసం నిస్వార్థంగా విధులు నిర్వహించే పోలీసు అధికారులకు ఇలాంటి అరుదైన పురస్కారాలు దక్కడం ఎంతో సంతోషకరమని సంపత్ రావు పేర్కొన్నారు. సీఐ నిరంజన్ రెడ్డి మరిన్ని సేవలు అందించి పోలీసు శాఖకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి

- పదవీ బాధ్యతలు స్వీకరించిన అధికారి..



హైదరాబాద్, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) : టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆహార, ఔషధాల నాణ్యత ప్రమాణాలను మరింతగా మెరుగు పరచడానికి ప్రభుత్వం ఆహార భద్రత, ఔషధ నియంత్రణ భాగాలను వీలీనం చేసి టీజీ సేఫ్‌గా ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఈ శాఖకు డైరెక్టర్‌గా అవినాశ్ మహంతి డైరెక్టర్ గా కొనసాగను న్నారు. టీజీ సేఫ్ గా ఏర్పాటు చేశారు.

# ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

- గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలి
- ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి
- అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలి
- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలి
- ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలి
- మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి
- అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి : మంత్రి అనసూయ సీతక్క



ములుగు, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని,మండల ప్రజావాణి కి వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం తెలియజేయాలని,ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని,అత్యవసర సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని,ప్రజలను సమస్యలను పరిష్కరించడంలో అధికారులు కాలయాపన చేయకూడదని,ఒంటరి మహిళలు, వితంతువుల,వికలాంగుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలని,స్థానిక అధికారులు మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని,అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని,ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే గ్రీవెన్స్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.సోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులను క్రమపద్ధతిలో స్వీకరించాలని, స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను సంబంధిత జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించి వాటిపై సమాధానం తెప్పించి దరఖాస్తుదారులకు తెలియజేయాలని అన్నారు.గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారుడి సెల్‌ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలన్నారు. సమస్య పరిష్కారానికి ఎంత సమయం పడుతుందో ముందుగానే తెలియజేయడంతో పాటు, నిర్ణీత సమయంలో దరఖాస్తు పరిష్కారమైందా లేదా, పరిష్కారం కాకపోతే కారణం ఏమిటనే విషయాన్ని సంబంధిత వ్యక్తికి స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు.అత్యవసర సమస్యల విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలకు అవసరమైన సమయాన్ని అంచనా వేసి, కనీసం వారం రోజుల్లో దరఖాస్తుదారులకు పురోగతిపై సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు ఒకే సమస్య కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదన్నారు.మండలాల వారీగా గ్రీవెన్స్ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడం ద్వారా జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజల సంఖ్య తగ్గడంతో పాటు స్థానికంగానే సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అధికారులు విధులను బాధ్యతగా, చిత్తశుద్ధితో నిర్వహించి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కార దిశగా పరిశీలించాలని సూచించారు.ఒంటరి మహిళలు, వితంతువులకు, సంబంధించిన పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అన్ని గ్రామాల నుంచి పూర్తిస్థాయిలో స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హుల పింఛన్లకు ప్రభుత్వం దశలవారీగా చర్యలు చేపడుతోందని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోలేదనే పరిస్థితి తలెత్తకుండా ఎంపీడీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, అంతర్గత వాడలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్నారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి తదితర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని, ఎస్టీ తండాలు, గూడేల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత, సీసీ రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, తహసిల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో వరుణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 113 ఫిర్యాదుల స్వీకరణ

- కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్, ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) : వికారాబాద్ జిల్లా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భం గా మొత్తం 113 దరఖాస్తులు స్వీకరించారు. ప్రధానంగా పెన్షన్లు, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు.ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని, శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లా లో ప్రతి మండలంలో ప్రజావాణి ఇక నుంచి ప్రతి సోమవారం ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగా నిర్వహించే మండల ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అలాగే జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్వో స్వర్ణలత, డీఆర్డీఓ శ్రీనివాస్‌తో పాటు జిల్లా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రదేశాల్లో పోస్టర్లు లేని కార్యక్రమం

- పరిశుభ్రమైన ప్రజా ప్రదేశాల దిశగా సీఎంసీ చర్యలు




సైబరాబాద్ ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచే చర్యల్లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) "నో పోస్టర్స్ ఇన్ పబ్లిక్ స్పేసెస్" కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. రోడ్లు, జంక్షన్లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో అనధికార పోస్టర్లు, బ్యానర్లు తదితర దృశ్య కాలుష్యాన్ని నివారించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.ప్రజా ప్రదేశాల రూపాన్ని మెరుగుపరచడంతో పాటు రోడ్లు, జంక్షన్లను స్పష్టంగా, అడ్డంకులు లేకుండా ఉంచడం, పరిశుభ్రమైన మరియు క్రమబద్ధమైన పట్టణ వాతావరణాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సీఎంసీ పేర్కొంది.

## లక్షల్లో జీతాలు మీకు.. గుంతల్లో గాయాలు మాకా..?

- బీజేపీ శ్రేణులతో కలిసి జోనల్ కార్యాలయాన్ని ముట్టడించిన మాజీ కార్పొరేటర్ శ్రవణ్..




మల్కాజిగిరి ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. రోడ్లపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉత్తమ్‌నగర్ రోడ్డు పనులను ఈ నెల 13న ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ తీరును నిరసిస్తూ బీజేపీ శ్రేణులతో కలిసి జోనల్ కార్యాలయాన్ని ముట్టడించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.కార్పొరేషన్ పరిధిలో వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ పూర్తిస్థాయిలో విఫలమయ్యాయని శ్రవణ్ విమర్శించారు. ఈ వైఫల్యాలకు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి నడిబొడ్డున జరిగే బోనాల ఉత్సవాలకు కూడా కమిషనర్ హాజరుకాకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు.ప్రజలపై పన్నుల భారం పెంచుతున్న ప్పటికీ అభివృద్ధి పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు.అధికారులు ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.చివరకు ఇంజనీరింగ్ అధికారులు లక్ష్మణ్, లౌక్య తదితరులు అక్కడికి చేరుకుని ఉత్తమ్‌నగర్ రోడ్డు పనులను ప్రారంభించడంతో ఆందోళన ముగిసింది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాజలక్ష్మి, సునీతా యాదవ్, సీనియర్ నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, బాలచందర్, జోగు వెంకటేష్, రామ్ లగన్, సాయిబాబా, ఓం, రవి, రాజు, నాగరాజ్, రామకృష్ణ, జె.వి. యాదవ్, కిరణ్, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితా 2026 విడుదల

- జిల్లాలోని 1,127పోలింగ్‌కేంద్రాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా
- ఓటర్లు తమ పేరు, వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలి
- సెప్టెంబర్ 16వరకు క్లైయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం
- అర్హత కలిగిన ప్రతి ఒక్కరిపేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ అంకిత్



భద్రాద్రికొత్తగూడెం ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా 2026ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ సోమవారం విడుదల చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 1,127పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన కోసం ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. సంబంధిత ఎలక్టోరల్‌రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, కార్యాలయాల పరిధిలో కూడా ముసాయిదా ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాలోనిఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 27మండలాలు ఉన్నాయని, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 8,63,413మంది జనరల్ ఎలక్టర్లు ఉన్నట్లు తెలిపారు. వీరిలో 4,19,558మంది పురుషులు, 4,43,805మంది మహిళలు, 50మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని వివరించారు. అదే విధంగా 28మంది ఎన్‌ఆర్‌ఐ ఎలక్టర్లు, 723మంది సర్వీస్‌ఓటర్లు నమోదై ఉన్నారని, అన్ని కేటగిరిలను కలిపి జిల్లాలో మొత్తం 8,64,164మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా 110-పినపాక ఎస్టీనియోజక వర్గంలో 1,74,854మంది జనరల్‌ఎలక్టర్లు, 2మంది ఎన్‌ఆర్‌ఐ ఎలక్టర్లు, 197 మంది సర్వీసు ఓటరుల ఉన్నార న్నారు. 111ఇల్లందు ఎస్టీ నియోజక వర్గంలో 1,94,860మంది జనరల్ ఎలక్టర్లు 4మంది ఎన్‌ఆర్‌ఐఎలక్టర్లు, 274మంది సర్వీసు ఓటర్లుఉన్నట్లు తెలిపారు. 117కొత్తగూడెం నియోజ కవర్గంలో 2,15,639మంది జనరల్ ఎలక్టర్లు, 14మంది ఎన్‌ఆర్‌ఐ ఎలక్టర్లు, 152మంది సర్వీస్‌ఓటర్లు, 118 అశ్వారావుపేట ఎస్టీ నియోజకవర్గంలో 1,44,770మంది జనరల్ ఎలక్టర్లు, 6మంది ఎన్‌ఆర్‌ఐఎలక్టర్లు, 50మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు వివరించారు. 119భద్రాచలం ఎస్టీ నియోజకవర్గంలో 1,33,290మంది జనరల్‌ఎలక్టర్లు, 2మంది ఎన్‌ఆర్‌ఐ ఎలక్టర్లు, 50మంది సర్వీస్‌ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లైయిమ్‌లు అభ్యంతరాలను ఈనెల 17నుంచి సెప్టెంబర్ 16వరకు సమర్పించవచ్చన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఓటర్ల వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోని ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో నిర్ణీత గడువులోగా క్లైయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించాలన్నారు.

## మేడ్చల్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీ.ఆర్.ఎస్ నాయకుల ధర్నా



మేడ్చల్ ఆగస్టు 18 (జర్నలిస్ట్ ఫైల్) : మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ధర్నాలో మేడ్చల్ సర్కిల్ పరిధి,ఎల్లంపేట మున్సిపాలిటీ కి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు ,అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించి, పెండింగ్‌లో ఉన్న చెక్కులను తక్షణమే అందించాలని వారు డిమాండ్ చేశారు.లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, జగన్ రెడ్డి, దాయానంద్ యాదవ్,వెంకటేష్ యాదవ్, రాజు నాయక్,చైర్మన్ శ్రీదేవి రమేష్,కౌన్సిలర్లు సద్ది నిశిత రెడ్డి,సురేష్ రెడ్డి ,భాస్కర్, కరుణాకర్ రెడ్డి,నాయకులు యూనిస్ పాషా,శ్రీనివాస్ రాజు,తడుం గణేశ్, గడం రాజు ,రాజీ రెడ్డి, రణదీప్ రెడ్డి, విఠల్, శ్రీహరి,రమేష్ యాదవ్,శైలందర్ రెడ్డి, సందీప్ గౌడ్,విష్ణు చారి,నాగరాజు ముదిరాజ్,శ్రీకాంత్ నాయక్, వెంకటేష్ ముదిరాజ్, పుడూర్ వెంకటేష్,బ్యాండ్ శంకర్,నవీన్ రెడ్డి,గోపాల్ రెడ్డి, బాల్ రాజ్,సుదర్శన్ రెడ్డి,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ, గుంటూరు ఎస్పీ



○ తుళ్లూరు పరిధిలో చెక్‌పోస్టులు, వీఐపీ మార్గాలు, నిఘా వ్యవస్థల తనిఖీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాటి, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అసెంబ్లీ పరిసర ప్రాంతాలను సందర్శించి బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

అసెంబ్లీకి వచ్చే ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, వాహన తనిఖీ కేంద్రాలు, ప్రవేశ ద్వారాలు, వీఐపీ–వీవీఐపీ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ ప్రతి వ్యక్తి, వాహనాన్ని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాల కదలికలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

అసెంబ్లీ భవనం, శాసనసభ–శాసన మండలి హాళ్లు, ప్రవేశ ద్వారాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, కేటాయించిన ప్రాంతాలను విడిచిపెట్టకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. డ్రోన్ నిఘా, సీసీ కెమెరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

అసెంబ్లీ పరిసరాల్లో అనుమతి లేని ర్యాలీలు, ధర్నాలు, నిరసనలకు అవకాశం ఇవ్వకుండా ముందస్తు నిఘా కొనసాగించాలని, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ నిర్వహణలో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

ఈ పరిశీలనలో అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ సుంకరయ్య, సీఐలు మల్లికార్జునరావు, కె. శ్రీనివాసరావు, ఆర్ఐలు కృష్ణయ్య, శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అధికారుల సూచనలు పాటించాలి



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్):** కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకోవాలని కాకుమాను మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. కాకుమాను మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కాకుమాను మండలంలోని గరికపాడు , తెలగాయపాలెం గ్రామ పరిధిలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి వి సుధాకర్ మాట్లాడుతూ కౌలుకి వేసే రైతులందరూ కౌలు రైతు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలైన మినుము, పెసర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల వల్ల వేసిన వరి పైరు కు పొటాషియం నైట్రేట్ లీటర్ నీటికి 10 గ్రాముల చొప్పున 15 రోజుల వ్యవధిలో ఒకసారి పిచికారి చేసుకోవాలన్నారు. దీనివలన ఏడు నుంచి పది రోజులు వరకు వరి పైరును బెట్ట పరిస్థితుల నుండి కాపాడుకోవచ్చన్నారు . అంతే కాకుండా ప్రకృతి వ్యవసాయ సేద్యం ద్వారా ద్రవ జీవామృతంను ప్రతి పదిహేనురోజుల ఓసారి పిచికారి చేయడం వల్ల వరి పైరు బెట్ట పరిస్థితి నుండి కాపాడుకోవచ్చున్నారు . వరి పైరు వేసిన ప్రతి ఒక్కరూ పంట నమోదును కంపల్సరిగా చేయించుకోవాల్సి ఉంటుంది అని తెలియజేశారు .

ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ నుంచి వెటర్నరీ డాక్టర్ పశువులకు వచ్చే వ్యాధుల గురించి మరియు అమలు చేస్తే పథకాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి సుధాకర్, మండల వెటర్నరీ అధికారి బి శేఖర్ ,గ్రామ వ్యవసాయ సహాయకులు భాస్కర్ రెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాల బహూకరణ



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం మంగళగిరి పౌర గ్రంథాలయానికి రూ.10,000 విలువైన పుస్తకాలను మంగళవారం నవులూరు టిడిపి నాయకులు మర్రి ఏసుబాబు అందచేశారు. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఈ పుస్తకాలను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మర్రి ఏసుబాబు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను వినియోగించుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పౌర గ్రంథాలయ సిబ్బంది, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

## వివిధ శాఖల్లోని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



**మరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ రోజు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఛైర్మన్ శశిధర్‌ని కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నల్లపల్లి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ యూనివర్సిటీ లో ఖాళీ గా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు, గ్రూప్ 1, 2 నియామకాలు, ఇన్ సర్వీస్ ఉద్యోగుల ప్రమోషన్, అ–ర్హత పరీక్షల గురించి చర్చించినట్టు తెలిపారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రజల సహకారం అవసరం

○ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై గుంటూరు నగర పాలక సంస్థ కఠిన చర్యలు అభినందనీయం -ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేందుకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (జీఎంసీ) చేపడుతున్న చర్యలు అభినందనీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం నేడు పర్యావరణానికే కాకుండా మానవాళికి, పశుపక్ష్యాదులకు తీవ్ర ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఒక సెల్ఫీ వీడియో ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, అనేక జీవరాశులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గతంలో ఎన్నోసార్లు కోరినట్లు తెలిపారు. ఆ దిశగా జీఎంసీ అధికారులు ముందడుగు వేయడం సంతోషకరమన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయదారులకు, వినియోగదారులకు ఇప్పటికే నెల రోజుల క్రితమే నోటీసులు జారీ చేసి అవగాహన కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్దేశిత ప్రమాణాలకు లోబడని ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నిషేధించాలని సూచించినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అందుకే జీఎంసీ అధికారులు నిబంధనలను ఉల్లంఘించిన వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుంటున్నారని చెప్పారు.

అయితే కేవలం వ్యాపారులను నియంత్రించడం మాత్రమే సరిపోదని, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ వ్యర్థాల కోసం ప్రత్యేక డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, నీటి సీసాలు, చిప్స్ ప్యాకెట్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసి నిల్వ చేయాలని సూచించారు. వారానికి ఒకసారి వాటిని పారిశుధ్య సిబ్బందికి అప్పగించేలా అలవాటు చేసుకోవాలని కోరారు.

జీఎంసీ ఆధ్వర్యంలో ఇంటింటి చెత్త సేకరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర చెత్తతో కలిపి ఇస్తే వాటిని తిరస్కరించే విధానాన్ని అమలు చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అందువల్ల ప్రతి కుటుంబం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

ప్రపంచంలోని అత్యంత పరిశుభ్రమైన నగరాలు, అభివృద్ధి చెందిన దేశాలు పరిశుభ్రతలో ముందుండటానికి ప్రభుత్వాల కఠిన చర్యలతో పాటు ప్రజల సహకారమే ప్రధాన కారణమని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన, భాగస్వామ్యం, సహకారం పెరిగితేనే ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం గత కొన్ని నెలలుగా నిరంతర కృషి చేస్తున్న జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్, జిల్లా కలెక్టర్ సిఎం సాయికాంత్ వర్మతో పాటు సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అవగాహన కార్యక్రమాలతో పాటు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు అమలు చేస్తూ ప్లాస్టిక్ నియంత్రణకు కార్యాచరణ చేపట్టినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు భద్రతపై బాధ్యతగా ఉండాలి : ఎమ్మెల్యే నసీర్

○ రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ తప్పనిసరిగా వినియోగించాలి

○ అత్యధిక రోడ్డు ప్రమాదాలకు రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేకపోవడమే కారణం

○ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి

○ అసెంబ్లీ జీరో అవర్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రోడ్డు భద్రత పై అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనదారులు పాటించాల్సిన నియమాల గురించి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అసెంబ్లీ సాక్షిగా ప్రజల్లో చైతన్యం కలిగించేలా ప్రసంగించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరో అవర్ లో వాహనాలపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ అంశంపై సభ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు పై జరిగే ఒక ప్రమాదం ఒక కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని, దీనిపై ఎప్పటికప్పుడు చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేశారు. 2023లో 19497 రోడ్డు ప్రమాదాలలో 8147 మంది మరణించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తున్నామని, అయితే ప్రమాదాల సంఖ్య తగ్గినప్పటికీ మరణాల సంఖ్య పదిహేను శాతం పెరిగిందని చెప్పారు. ఇది దేశంలోని సగటు కంటే ఎక్కువని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణం చేపడుతూనే భద్రత చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేకపోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రజల్లో చైతన్యం రావాలని చెప్పారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేని వాహనాలకు లైసెన్స్ రద్దు చేస్తున్నారని ఇది ప్రతినిత్యం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ వాహనాల నుంచి ఊడిపోతే తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రహదారుల నుంచి చిన్న పల్లెటూర్లకు వెళ్లే రోడ్ల వరకు ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై రాష్ట్రప్రభుత్వం ఎంతో పారదర్శకంగా పని చేస్తోందని తెలిపారు. హైవేలపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో 79 శాతం రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేకపోవడమే కారణమన్నారు. దీనిపై పటిష్టమైన చర్యలు తీసుకొని రోడ్డు ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు.

## పనుల నాణ్యతలో రాజీ లేదు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** వసతి, విద్యా సంస్థల నవీకరణ (మార్పు) పనుల నాణ్యతలో రాజీ లేదని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మార్పు కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 36 వసతి, విద్యా సంస్థలలో మార్పు కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని వివరించారు. ప్రస్తుతం ఎంపిక చేసిన సంస్థలలో సుందరీకరణ, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడమే కాకుండా కనీస వసతులు పక్కాగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పది మందికి ఒక మరుగుదొడ్డి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీరు పరిరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) నిర్మాణాలు, సౌర విద్యుత్ కల్పన, వ్యర్థాల నివారణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె. ఎల్. హర్షిత, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె. మయూరి,

జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె.పార్థసారథి, ఎపిఇడబ్ల్యుఐడిసి కార్యనిర్వహణ ఇంజనీర్ అనిల్ కుమార్, రహదారులు, భవనాలు శాఖ ఇంజనీర్లు, నెడ్ క్యాప్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో 'నీటి' కష్టాలు

○ ప్రాణాలను పణంగా పెడుతున్న విద్యార్థులు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** పేరుకే అది అంబేద్కర్ మహా గురుకులం కానీ అక్కడ కనీస వసతులు కరువై విద్యార్థుల భవిష్యత్తు ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల లేమి తీవ్రరూపం దాల్చింది. తాగడానికి, స్నానాలకు నీరు అందక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్నానం చేయడం కోసం భవనాలపై ఉన్న నీటి ట్యాంకుల వద్దకు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. ఎత్తైన భవనాలపై సాహసకృత్యాలు.. ప్రమాదం జరిగితే బాధ్యులెవరు. పాఠశాలలో సరైన నీటి సరఫరా వ్యవస్థ లేకపోవడంతో విద్యార్థులు నీటి కోసం ఎత్తైన భవనం పైకప్పులపైకి ఎక్కి,రక్షణ గోడలపై ప్రమాదకర రీతిలో కూర్చుంటున్నారు. కాలు జారి కిందపడితే ప్రాణాలు పోతాయని తెలిసినా, వేరే మార్గం లేక ఈ ప్రమాదకర సాహసాలు చేస్తున్నారు. రోజూ ఇంత జరుగుతున్నా వార్డెన్ గానీ, హాస్టల్ సిబ్బంది గానీ పట్టించుకోకపోవడం పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది. రేపు ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగి ప్రాణనష్టం సంభవిస్తే దానికి బాధ్యత వహించేది ఎవరు.? అధికారులా.? లేక నాయకులా.?

**హడావుడి ప్రారంభోత్సవాలే తప్ప తీరని అగచాట్లు.!**

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎంతో హడావుడిగా ఆర్భాటంగా ఈ భవనాన్ని ప్రారంభించారు. కానీ ప్రారంభించిన రోజు నుంచే విద్యార్థుల అగచాట్లు మొదలయ్యాయి. నాయకులు, అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లడం తప్ప సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. అనేకమార్లు విన్నవించినా "చెవిటోడి ముందు శంఖం ఊదినట్లే" పరిస్థితి తయారైందని, అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులారా... నిద్రమత్తు వీడండి!**

'నేటి విద్యార్థులే రేపటి భారత భవిష్యత్తు' అని వేదికలపై ప్రగల్భాలు పలికే నాయకులు, అధికారులు ఆ పిల్లల కనీస నీటి అవసరాలను తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి తోట్లపల్లి గురుకులంలో నీటి ఎద్దడిని నివారించి, తగిన వసతులు కల్పించాలి. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటం మాని తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## బీసీలకు 34% రిజర్వేషన్లపై సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు

**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రి మండలి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి శాసనసభలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మరియు బీసీ ప్రజాప్రతినిధులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించి, వారి అభ్యున్నతికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వానికి ఈ నిర్ణయం మరో గొప్ప ముందడుగు అని వారు పేర్కొన్నారు.

## ఉద్యోగులందరికీ పరిమితులు లేని క్యాష్‌లెస్ వైద్యం కల్పించాలి



○ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని రకాల వ్యాధులకు ఎలాంటి పరిమితులు లేకుండా క్యాష్‌లెస్ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జయరాజు కోరారు. ఈ మేరకు జయరాజు ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు ఏపీ ఎంప్లాయిస్ హెల్త్ ట్రస్ట్ నూతన సీఈఓ ఎ.ఎ. పద్మావతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లో సాంకేతిక లోపాలు, వైద్య బిల్లుల తిరస్కరణ, హెల్త్ కార్డుల వినియోగంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు.

వినతులను సీఈఓ పద్మావతి సానుకూలంగా విని, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యలపై వెంటనే స్పందించిన సీఈఓ ఎ.ఎ. పద్మావతి, ఈఓ డాక్టర్ మాధవి, జేఈఓ డాక్టర్ శ్రవణ్, ఐటీ నిపుణుడు సూర్యలకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామం.. బూత్.. పంచాయతీ.. కమలం!

○ ప్రతి పంచాయతీలో కమలం వికసించాలి: నితిన్ నబిన్, పీవీఎన్ మాధవ్



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన బీజేపీ ఆంధ్రప్రదేశ్ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీజేపీని ప్రతి గ్రామానికి, ప్రతి బూత్‌కు తీసుకెళ్లాలని, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ సేవా కార్యక్రమాల ద్వారా వారి విశ్వాసాన్ని గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని నితిన్ నబిన్ అన్నారు.

2024 ఎన్నికల్లో ఎన్డీయేకు రాష్ట్ర ప్రజలు ఇచ్చిన విజయాన్ని మరింత బాధ్యతగా భావించాలని నితిన్ నబిన్ సూచించారు. 25 లోక్‌సభ స్థానాల్లో 21, 175 అసెంబ్లీ స్థానాల్లో 164 సీట్లు సాధించడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, 'సంపర్కం.. సంభాషణ.. సంబంధం' విధానంతో ప్రజల మధ్య నిరంతరం ఉండాలని చెప్పారు. బీజేపీ త్యాగం, తపస్సు, సిద్ధాంతం, దేశ ప్రథమ భావనపై నిర్మితమైన పార్టీ అని, పదవుల కంటే ప్రజల మధ్య పనిచేసే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పేర్కొన్నారు.

ప్రతి గ్రామంలో కమలం వికసించేలా కార్యాచరణ రూపొందించాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. 'మన ఊరు--మన జెండా' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరాలని, రాష్ట్రంలోని 13,219 గ్రామ పంచాయతీల్లో పార్టీ ప్రజాప్రతినిధులు గెలిచేలా కృషి చేయాలని అన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుడు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ నుంచి మున్సిపల్ కౌన్సిలర్, కార్పొరేటర్, ఛైర్మన్, మేయర్ వరకు పార్టీకి ప్రాతినిధ్యం పెంచుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రత్యేక కార్యాచరణతో ప్రతి జిల్లాలో పార్టీ బలాన్ని విస్తరించాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ ముందుండాలి అని మాధవ్ అన్నారు. 'జనతా వారధి' కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించాలని, ప్రతి బూత్‌లో 'మన్ కీ బాత్' నిర్వహించాలని సూచించారు. యువతను పార్టీకి మరింత చేరువ చేసేందుకు 'వికసిత్ భారత్ యువ సంవాద్' వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. విశాఖ రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీ, గూగుల్ సెంటర్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, అనకాపల్లి బల్క్ డ్రగ్ పార్క్ వంటి అభివృద్ధి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు.

పోలవరం, జలవనరుల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మాధవ్ కోరారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని, కృష్ణా–గోదావరి జలాల సమన్వయంతో రాయలసీమకు దక్కాల్సిన నీటిని అందించాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవం' నిర్వహించాలని పిలుపునిచ్చారు. అన్ని సామాజిక వర్గాలతో అనుసంధాన కార్యక్రమాలు చేపట్టి, యువతను పార్టీతో మరింతగా అనుసంధానం చేయాలని సూచించారు.

కూటమి ధర్మాన్ని పాటిస్తూనే రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. 'నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్స్ట్.. సెల్ఫ్ లాస్ట్' సిద్ధాంతంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, జాతీయ సహ సంస్థాగత ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీ డ్రోన్ కార్పొరేషన్ మధ్య ఎంవోయు



○ డ్రోన్ పరిశోధన, శిక్షణకు వ్యూహాత్మక భాగస్వామ్యం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య అవగాహన ఒప్పందం (ఎంవోయు) కుదిరింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు డ్రోన్ సిటీలో నిర్వహించిన జాతీయస్థాయి డ్రోన్ సమ్మిట్‌లో ఈ ఒప్పందం జరిగింది.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే. రామ్మోహన్ నాయుడు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ తరపున రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ గీతాంజలి శర్మ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ భాగస్వామ్యంతో వ్యవసాయం, మౌలిక వసతులు, విపత్తుల నిర్వహణ, ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవలు, మెడికల్ డెలివరీ, అధునాతన వైమానిక రవాణా తదితర రంగాల్లో అంతరశాఖ పరిశోధనలు, డ్రోన్ ఆధారిత అనువర్తనాలు, సాంకేతిక ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభించనుంది.

కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రీసర్చ్ డీన్ ఆచార్య రంజిత్ తాపా, డాక్టర్ ప్రణవ్, డాక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల పక్షపాతి సీఎం చంద్రబాబు : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



○ స్థానిక సంస్థల్లో 34 రిజర్వేషన్ హర్షణీయం

○ ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు.

బీసీలకు తెలుగుదేశం పార్టీ మొదట నుంచి వెన్నెముకగా నిలుస్తోందన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ద్వారా మరోసారి బీసీలపై తమ చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం నిరూపించుకుందని చెప్పారు. మున్సిపాలిటీల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు.

ఇది తెలుగుదేశం పార్టీ ఎన్నికల హామీ కాదని, తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని స్పష్టం చేశారు.

హామీలు ఇవ్వడంతోనే ఆగిపోకుండా వాటిని అమలు చేసి చూపిస్తోన్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బీసీలను ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదిగేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందులో భాగంగా రిజర్వేషన్ల ద్వారా రాజకీయ ఉన్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు.

గత జగన్ హయాంలో బీసీలు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వైసీపీ నిర్వాకం వల్ల బీసీ రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని మండిపడ్డారు.

## ఏపీ బ్రాండ్‌ను గ్లోబల్ స్థాయిలో ప్రమోట్ చేసేందుకు అసోచామ్ ప్రతిపాదన



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, వాణిజ్యం, పరిశ్రమల వృద్ధికి ఉన్న అనుకూల వాతావరణాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసేందుకు అసోచామ్ ప్రతినిధులు ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తమ ఆసక్తిని వ్యక్తం చేశారు.

ఈ మేరకు అసోచామ్ సీనియర్ డైరెక్టర్లు ప్రేమిందర్ జీత్ కౌర్, వరుణ్ అగర్వాల్, సౌత్ స్టేట్స్ రీజనల్ డైరెక్టర్ మచ్చా దినేష్ బాబు సోమవారం సచివాలయంలో ఆర్అండ్‌బీ, ఐ&ఐ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న కీలక పాలసీలు, విధానపరమైన నిర్ణయాలకు జాతీయంంంంరు, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించడంతో పాటు రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని అసోచామ్ ప్రతినిధులు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

'ఆంధ్రప్రదేశ్' బ్రాండ్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడానికి ఉన్న అవకాశాలను కూడా అసోచామ్ ప్రతినిధులు మంత్రికి వివరించారు.

ప్రతినిధుల ప్రతిపాదనలపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

పూర్తి స్థాయి ఆలోచనలు, ప్రతిపాదనలతో ముందుకు వస్తే రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కలిసి పనిచేద్దామని మంత్రి తెలిపారు.

# ఏపీ పారిశ్రామికాభివృద్ధి విధానం చాలా బాగుంది

○ డేటా లేక్, స్మార్ట్ గవర్నెన్స్ పాఠాలు మాకు నేర్పండి

○ అమరావతి నగరం ప్రపంచంలోనే అద్భుత నగరం అవుతుంది

○ విద్య-ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌తో ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ శిర్సా



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి రాజధాని నిర్మాణ తీరును చూశాం. నిజంగా ఇదొక అద్భుతం. ప్రపంచంలోనే ఇదొక గొప్ప నగరంగా మారుతుంది. నారా చంద్రబాబు నాయుడు విజనరీ ముఖ్యమంత్రి. అభివృద్ధికి, దార్శనికతకు ఆయనొక విశ్వవిద్యాలయం. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఏపీ ప్రభుత్వం మార్గదర్శి. ఏపీని చూసి ఢిల్లీ ప్రభుత్వం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అనేక రంగాల్లో మాకు మీ సహకారం కావాలి అని మంత్రులు లోకేష్, టీజీ భరత్‌లతో ఢిల్లీ పరిశ్రమలు, ఆహారం, అటవీ పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా కోరారు.

ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమలు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా నేతృత్వంలో ఆ ప్రభుత్వానికి చెందిన ప్రత్యేక ప్రతినిధుల బృందం ఏపీలో పర్యటించి ఇక్కడి పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తోంది. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజిఎస్)లో రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో ఈ బృందం మంగళవారం సమావేశమైంది. ఈ బృందానికి రాష్ట్ర ఐటీ, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లు సాదర స్వాగతం పలికి రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం గురించి వివరించారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని మంత్రి నారా లోకేష్ వివరించారు. 2026 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించిందన్నారు. భాతరదేశం ఆకర్షిస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వస్తున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా క్లస్టర్ ఆధారిత అభివృద్ధి దిశగా పారిశ్రామికాభివృద్ధి సాధిస్తున్నామన్నారు. తిరుపతి ప్రాంతంలో ఎలక్ట్రానిక్ క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా ఆ రంగానికి చెందిన పరిశ్రమలు, అనుబంధ రంగ పరిశ్రమలన్నీ ఒకే చోట నెలకొల్పడానికి కావాల్సిన అనువైన వాతావరణం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో మొత్తం 22 క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమరావతి, తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాలను ఎకనామిక్ జోన్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇటీవలే ఉత్తరాంధ్ర ప్రగతికి కీలకం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. రాయలసీమలోని కర్నూలు జిల్లాలో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డేటా లేక్ ద్వారా పాలనను మరింత సరళీకృతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలకు చెందిన డేటాను ఒక చోట అనుసంధానించి డేటా లేక్ రూపొందించామని, దాని ద్వారా స్మార్ట్ గవర్నెన్స్ ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. డేటా కేవలం ఒక సోర్సు నుంచి కాకుండా పలు సోర్సుల ద్వారా సేకరించి ఎప్పటికప్పుడు విశ్లేషించి డేటాను నిరంతరం అప్‌డేట్ చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పనితీరును కూడా తాము ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పరిశీలిస్తూ పనిచేస్తున్నామన్నారు. మంత్రుల మొదలు, ప్రభుత్వంలో కింది స్థాయి ఉద్యోగి వరకు వారి పనితీరుకు ర్యాంకులు ఇస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో సభలు నిర్వహించినప్పుడు అక్కడ ఆ సభల్లోనే ప్రజల సమక్షంలో మంచిగా పనిచేసిన ఉద్యోగులను అభినందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వంపై ప్రజలో ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడానికి ఏపీ అన్నివిధాలా అనుకూలమైన రాష్ట్రంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే వారికి ఎలాంటి అవరోధాలు లేకుండా అనుమతులన్నీ సులభంగా వచ్చేలా సింగిల్ డెస్క్ పోర్టల్ అమలు చేస్తున్నామన్నారు. డేటా సెంటర్లు, షిప్ బిల్డింగ్, సెమీకండక్టర్స్, మెడికల్ డివైజులు, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్‌ల మొదలు రాష్ట్రంలో 22 ప్రత్యేక క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా నూతన పారిశ్రామికాభివృద్ధి విధానం 4.0 ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

**ఏపీ నుంచి మేం ఎంతో నేర్చుకోవాలి.. ఏపీ సహకారం కావాలి:** పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి విధానాల అమలు తదితర అనేక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌ను చూసి మేము చాలా నేర్చుకోవాల్సి ఉందని ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా అన్నారు. తాను చాలా ప్రభుత్వాలను చూస్తున్నానని కానీ డేటాను ఇంత సమర్థవంతంగా వినియోగించుకుని సత్ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్షిప్ కు ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శిగా నిలిచిందన్నారు. అమరావతిలో ఇంత పెద్ద నిర్మాణ పనులు జరుగుతుండటం చూసి ఆశ్చర్యపోయానన్నారు. ఢిల్లీలో ఇంత పెద్ద నిర్మాణాలు జరగడానికి ఆస్కారం లేదన్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచంలోనే ఒక గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతుందనడంలో ఎంత మాత్రం అనుమానం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విశ్వవిద్యాలయం లాంటి వారని, ఆయన పుత్రులు మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు. మీ విశ్వ విద్యాలయంలో ఇప్పుడు మాకు కూడా అడ్మిషన్ ఇవ్వండి అని మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ చమత్కరించారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విధానాల రూపకల్పన, డేటా డ్రివన్ గవర్నెన్స్ అమలు, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికున్న అపార అనుభవంతో ఢిల్లీ ప్రభుత్వానికి ఏపీ సహకారం అందించాలని కోరారు. ఏపీ బృందాన్ని ఢిల్లీకి పంపాలని, అక్కడ తమ అధికారులకు ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలు, విధానాల గురించి వివరించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ ఢిల్లీ ప్రభుత్వానికి తాము పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 9వ రోజుకు చేరిన ఏపీ జూడా సమ్మె

○ గుంటూరులో 500 మంది జూనియర్ వైద్యుల శాంతియుత పాదయాత్ర



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) రాష్ట్రవ్యాప్త సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరుకుంది. మూడో దశ ఆందోళనలో భాగంగా రెండో రోజు గుంటూరు మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యులు స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలు, పాదయాత్ర నిర్వహించారు.

ఉదయం జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద సమావేశమైన జూనియర్ వైద్యులు తమ నిరసనను కొనసాగించారు. అనంతరం సుమారు 10.30 గంటలకు 500 మంది ఇంటర్న్లు, పీజీ వైద్యులు, సూపర్ స్పెషాలిటీ పీజీలు, సీనియర్ రెసిడెంట్లు పాల్గొన్న శాంతియుత పాదయాత్ర జీజీహెచ్ ఎమర్జెన్సీ గేట్ నుంచి ప్రారంభమైంది.

ర్యాలీ ఎంటీపీ సర్కిల్, మూడుబొమ్మల సెంటర్, కలెక్టర్ కార్యాలయం మీదుగా గుంటూరు మెడికల్ కాలేజీ, జీజీహెచ్ వరకు సాగింది. ఎంటీపీ సర్కిల్, మూడుబొమ్మల సెంటర్ వద్ద మానవహారాలు ఏర్పాటు చేసిన వైద్యులు తమ న్యాయబద్ధమైన డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించారు.

ర్యాలీ మొత్తం శాంతియుతంగా, క్రమశిక్షణతో సాగగా ట్రాఫిక్‌కు అతి తక్కువ అంతరాయం కలిగేలా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి.

ప్రభుత్వంతో చర్చలకు తాము ఇప్పటికీ సిద్ధంగానే ఉన్నామని, వీలైనంత త్వరగా సంప్రదింపులు ప్రారంభించి తమ డిమాండ్లకు సామరస్యపూర్వక పరిష్కారం చూపాలని ఏపీ జూడా ప్రతినిధులు కోరారు.

## ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ నాగబాబు నియామకం పట్ల మంత్రి దుర్గేష్ హర్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ 'ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్)' ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కేబినెట్ హోదా కల్పిస్తూ ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు) నియామకం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నాగబాబు నేతృత్వంలో "పచ్చని ఆంధ్రప్రదేశ్ – ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్" ఆశయ సాధన దిశగా రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా స్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడంతో వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను ఎమ్మెల్సీ నాగబాబు సమర్థవంతంగా నిర్వహిస్తారని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ పరిరక్షణ మరియు పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే ఏపీ గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో 2047 నాటికి ఈ లక్ష్యాన్ని సమర్థవంతంగా సాధించే దిశగా నూతన చైర్‌పర్సన్ నాయకత్వంలో కార్యాచరణ కొనసాగాలని అభిప్రాయపడుతూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలి

○ నో-బిడ్స్ మరింత తగ్గాలి.. రైతులకు మెరుగైన ధర దక్కేలా చర్యలు చేపట్టాలి

○ పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో తాజా పరిస్థితిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎఫ్‌సీవీ పొగాకు వేలాలు, కొనుగోళ్ల తాజా పరిస్థితిపై మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పొగాకు బోర్డు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోళ్ల వేగం పెరగడం, నో-బిడ్ శాతం క్రమంగా తగ్గుతుండటం సానుకూల పరిణామమని పేర్కొన్న మంత్రి, ఇదే వేగాన్ని కొనసాగిస్తూ రైతులకు మరింత మెరుగైన ధర లభించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఇప్పటివరకు 117 వేలాలు పూర్తయ్యాయని, సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు జరిగిందని, ప్రస్తుతం సగటు ధర కిలోకు సుమారు రూ.210 వద్ద కొనసాగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. ఇటీవల రోజుల్లో కొనుగోళ్ల వేగం పుంజుకుని రోజుకు సగటున 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు.

అదే సమయంలో నో-బిడ్ శాతం క్రమంగా తగ్గుతూ రావడం రైతులకు ఊరటనిచ్చే పరిణామమని మంత్రి పేర్కొన్నారు.

పొగాకు రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించి కొనుగోళ్ల పరిమాణాన్ని పెంచాలని, 'నో-బిడ్స్'ను మరింత తగ్గించాలని పొగాకు బోర్డు అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైతులకు లభిస్తున్న సగటు ధర మరింత పెరిగేలా కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా వేలాలు, కొనుగోళ్ల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు మెరుగైన ధర దక్కేలా పొగాకు బోర్డు, కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# యువశక్తితోనే నవభారత నిర్మాణం : మంత్రి సత్య కుమార్ యాదవ్

○ '2047' వికసిత భారత్ కోసం యువత ముందుకు రావాలి

○ భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పిలుపు

○ యువతను భాగస్వామ్యం చేయటమే కార్యక్రమ ఉద్దేశం

○ ప్రజా ప్రతినిధులతో ఇంటర్న్ షిప్ కు అవకాశం ఇవ్వాలని ఓ విద్యార్థి ప్రశ్న



**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ భవిష్యత్తును నిర్మించగల అత్యంత శక్తివంతమైన వనరు యువతేనని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పేర్కొన్నారు. యువతలో అపారమైన శక్తి, ప్రతిభ, ఆలోచనా సామర్థ్యం ఉన్నాయని.. ఆ శక్తికి సరైన దిశ చూపితే దేశాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలమని అన్నారు. విశాఖలో మంగళవారం సాయంత్రం ప్రత్యేకంగా యువ మోర్చా ఆధ్వర్యంలో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు నితిన్ నబిన్ సమాధానాలు ఇచ్చారు. "మీ శక్తికి సరైన దిశ చూపండి. మీ విజయం మీ కుటుంబానికే కాదు.. సమాజానికి, ఆంధ్రప్రదేశ్‌కు, యావత్ భారతదేశానికి గర్వకారణంగా మారాలి. 2047 భారతదేశం కోసం ఇప్పటి యువతే పునాది వేయాలి" అని నబిన్ పిలుపునిచ్చారు.

**కూల్చడం సులభం..నిర్మించడమే కష్టం...! :** "ఏదైనా వ్యవస్థను విమర్శించడం, కూల్చివేయడం సులభమేనని.. కానీ కొత్తదాన్ని నిర్మించడం ఎంతో కష్టమే. అందుకే యువత విధ్వంసం కంటే సృజన వైపు, విమర్శ కంటే పరిష్కారం వైపు, నిరాశ కంటే సానుకూల ఆలోచన వైపు అడుగులు వేయాలి. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసే ఇంటర్న్‌షిప్‌లు, నాయకత్వ కార్యక్రమాల ద్వారా యువతకు పాలనపై అవగాహన పెంచవచ్చు. విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం అంటే నిర్ణయాల ప్రక్రియలో భాగం కావడమే..

**ఉద్యోగాలు వెతికేవారి నుంచి సృష్టించేవారిగా.. :** ప్రపంచంలోని అనేక ప్రముఖ సంస్థలు, పరిశోధనా కేంద్రాల్లో భారతీయ యువత కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒకప్పుడు అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన యువత.. ఇప్పుడు ప్రపంచస్థాయి సంస్థలను నిర్మించే స్థాయికి ఎదుగుతోంది. దేశంలో స్టార్టప్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని, యువ పారిశ్రామికవేత్తలు ఉద్యోగాలు కోరుకునేవారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించేవారిగా మారుతున్నారు. తయారీ రంగం, మొబైల్ ఉత్పత్తులు, రక్షణ పరికరాలు, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు వంటి కొత్త రంగాల్లో భారత్ అవకాశాలను సృష్టించుకుంటోంది. విదేశాల్లో ఉన్న భారతీయ పారిశ్రామికవేత్తలు, పరిశోధకులు తిరిగి వచ్చి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన సమయం ఇదే.

**ఏఐతో విద్యలో కొత్త మార్పులు :** కృత్రిమ మేధ (ఏఐ) భవిష్యత్తులో విద్యా రంగంపైనా ప్రభావం చూపనుంది. ప్రతి విద్యార్థి సామర్థ్యం, అవసరానికి అనుగుణంగా వ్యక్తిగత అభ్యాస విధానాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.. JEE, NEET వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో విద్యా విధానంలో ఏఐ ఆధారిత సాధనాల వినియోగం మరింత పెరుగుతుంది.

**సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించాలి :** సోషల్ మీడియా యువత జీవితంలో కీలక భాగంగా మారింది. అయితే అందులో కనిపించే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మకూడదు తప్పుడు సమాచారం, మార్ఫింగ్ చిత్రాలు, ఏఐ ఆధారిత నకిలీ కంటెంట్ వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఫ్యాక్ట్ చెకింగ్ అలవాటు చేసుకోవాలి. హక్కుల గురించి మాట్లాడే సమయంలో బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలి. సానుకూలమైన సమాచారాన్ని పంచుకోవడం, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా సోషల్ మీడియాను మంచి మార్పుకు వేదికగా మార్చుకోవచ్చు" అని అన్నారు.

**యువత ఆలోచనలు స్వీకరణ :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేయడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. యువత నుంచి వారి ఆలోచనలు, సలహాలు సూచన స్వీకరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తరపున సంజీవిని, బాలల ఆరోగ్య పథకం ద్వారా పెద్దలు చిన్నారులకు అందరికీ ఆరోగ్య పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమం చివరిలో నితిన్, మంత్రి సత్య కుమార్ విద్యార్థులతో ముచ్చటించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467